టాప్ న్యూస్



## టీమిండియా వన్డే కెప్టెన్‌గా గిల్

- రోహిత్ కెరీర్ ముగింపు దశకు రావడంతో యువ ప్లేయర్‌కు పగ్గాలు
- కొంతకాలంగా జట్టుకు దూరంగా ఉంటున్న శ్రేయస్‌కు వైస్ కెప్టెన్‌గా ప్రమోషన్

02

## రూ.75లకే జియో బంపర్ రీఛార్జ్ ప్లాన్

- అన్‌లిమిటెడ్ బెనిఫిట్స్

02



## బాహుబలి కోసం రంగంలోకి అనుష్క శెట్టి

- మళ్లీ బాహుబలి సిరీస్ నాటి రోజులను ఇండస్ట్రీలో క్రియేట్ చేయాలన్నది రాజమౌళి ప్లాన్

02


ANN తెలుగు

Follow: @ANNTELUGU

05-10-2025

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 300 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

## రిజర్వేషన్ల రాజకీయం

తెలంగాణ రాజకీయాలు మళ్లీ వేడెక్కుతున్నాయి. ఓ వైపు జూబ్లీ హిల్స్ ఉపఎన్నిక... మరో వైపు రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల చర్చలు ఊపందుకున్నాయి. అక్టోబర్ 8న హైకోర్టులో ఏం జరుగుతుందనే ఉత్కంఠ నెలకొంది. రిజర్వేషన్ల రాజకీయం – నిజంగా ఎవరికి కలిసొస్తుంది? 69 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు సాధ్యమా? రాష్ట్రాల రిజర్వేషన్లకు రాజ్యాంగపరమైన శాస్త్రీయత ఉందా? అనే అంశాలపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఈ రిజర్వేషన్లతో ఎన్నికలు జరగడం అసాధ్యమన్న అభిప్రాయాలు ఎక్కువగా వినబడుతున్నాయి. ఓ వైపు గ్రౌండ్ లో స్థానిక రాజకీయం జరుగుతుంటే.. పార్టీల అధిష్టానాలు జూబ్లిహిల్స్ బైపోల్ పై ఫుల్ ఫోకస్ పెట్టాయి. జూబ్లిహిల్స్ బైపోల్ ఫలితం తెలంగాణ రాజకీయాల్లో కీలకం కానుంది. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు పాలన మళ్ళీ ఆర్థికస్థిరత్వం తీసుకొస్తుందన్న ఆశలు బలపడ్డాయి.

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్**

ఎడిటోరియల్ పేజీ 4లో



# జూబ్లీహిల్స్ తెరపై కొత్త ముఖాలు

## రేసులోకి బండి రమేష్, రంజిత్ రెడ్డి

స్పీడు పెంచిన కంజర్ల విజయలక్ష్మి

టికెట్ పై నవీన్ యాదవ్ ధీమా.. గ్రౌండ్ లో ప్రచారం..

పట్టువీడని బొంతు రామ్మోహన్, సీఎన్ రెడ్డి


బైపోల్ ను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సీఎం రేవంత్

ఇప్పటికే అందిన ఆశావహుల జాబితాలు

02

జూబ్లీహిల్స్ బైపోల్ వ్యవహారం అధికార పార్టీని టెన్షన్ పెడుతోంది..! పార్టీలో ఆశావాహులు రోజురోజుకు పెరుగుతుండటంతో.. టికెట్ ఎవరికి ఇవ్వాలనే విషయంలో ఆచీతూచీ అడుగులు వేస్తోంది. గెలుపు గుర్రానికే టికెట్ ఇవ్వాలని అధికార పార్టీ ఫిక్స్ అయ్యింది. అందుకే నియోజకవర్గంలో వరుస సర్వేలు నిర్వహిస్తున్నారు. మొదట నవీన్ యాదవ్, అంజన్ కుమార్ యాదవ్, బొంతు రామ్మోహన్, కంజర్ల విజయలక్ష్మి పేర్లు వినిపించాయి.. అయితే వీరంతా కూడా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని తట్టుకుని నిలబడతారా..! గెలిచే అవకాశాలు ఏమేరకు ఉన్నాయనే కోణంలో కాంగ్రెస్ పార్టీ లెక్కలు వేసుకుంటోంది.

**- మహా, హైదరాబాద్**




SRI GOLD
TRUSTED GOLD BUYERS


### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,19,400 |
| 22 క్యారెట్ | 1,09,450 |
| సిల్వర్ (కేజీ) | 1,55,000 |

## ఛత్ పండుగ తర్వాతే బీహార్ ఎలక్షన్స్

### ఈసీని కోరిన రాజకీయ పార్టీలు

**మహా :** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ఈనెల 27 తర్వాత నిర్వహించాలని ఈసీని అక్కడి రాజకీయపక్షాలు కోరాయి. బీహార్ శాసనసభ ఎన్నికలు ఛత్ పండుగ తర్వాత నిర్వహించాలని అక్కడి రాజకీయ పార్టీలు ఎలక్షన్ కమిషన్ (ఈసీ)ను కోరాయి. బీహార్ శాసన సభ ఎన్నికల సన్నద్ధతను పరిశీలించేందుకు రెండు రోజుల పర్యటన కోసం

మిగతా 2లో

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ | 81,207.17 |
| నిఫ్టీ | 24,894.25 |

### ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5 | 150 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5 | 150 |
| రిటైల్ గుడ్డు ధర | 5.3 | 159 |

# సుప్రీంకు స్థానికం

- బీసీ రిజర్వేషన్ల ఎపిసోడ్ లో బిగ్ ట్విస్ట్
- రేపు తేలనున్న భవితవ్యం



**హైదరాబాద్, మహా:** తెలంగాణ స్థానికసంస్థల ఎన్నికల ప్రక్రియలో మరో సంచలనం చోటుచేసుకుంది. ఎన్నికల ప్రక్రియలో లోపభూయిష్ట రిజర్వేషన్ విధానానికి వ్యతిరేకంగా, 50శాతం పరిమితి దాటిన రిజర్వేషన్లు రద్దుచేయాలంటూ సుప్రీంకోర్టుకు ఈనెల 29నే వెళ్ళగా, కోర్టు సోమవారం విచారించనుంది. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ వంగ గోపాల్ రెడ్డి సెప్టెంబరు 29న ఈ అప్పీలు దాఖలు చేశారు. జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం

మిగతా 2లో




## జూబ్లీహిల్స్‌లో గెలిచేది మేమే

- నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత సీఎం తీసుకున్నారు
- పిల్లలతో వచ్చి సానుభూతిని పొందాలనుకోవడం దారుణం
- మంత్రి పొన్నం ప్రభాకర్

వివరాలు 2లో

## జపాన్ తదుపరి ప్రధానిగా సనై తకైచీ

### తొలి మహిళా పీఎంగా రికార్డ్



**మహా:** జపాన్ తొలి ప్రధానిగా సనై తకైచీ రికార్డ్ నమోదుచేయనున్నారు. ఎల్‌డీపీ కొత్త అధ్యక్షురాలిగా సనై తకైచీ ఎన్నికయ్యారు. పార్టీ నాయకత్వం కోసం శనివారం జరిగిన ఎన్నికల్లో మాజీ ప్రధాని జునిచిరో కొయిజుమి కుమారుడు షింజిరో కొయిజుమిపై తకైచీ గెలుపొందారు. ఆ దేశంలో మెజారిటీ పార్టీ అధినేత పీఎం అవుతారు కాబట్టి తకైచీ ప్రధాని కావడానికి మార్గం సుగమం అయింది. దీంతో ఆమె త్వరలోనే జపాన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టనుండగా దేశ తొలి మహిళా పీఎంగా రికార్డు సాధించనునున్నారు.







## తెలంగాణలో ఈనెల 21 నుంచి పత్తి కొనుగోలు

### రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి వెల్లడి

### దళారులకు విక్రయించి నష్టపోవద్దని విజ్ఞప్తి



**హైదరాబాద్ :** తెలంగాణలో ఈ నెల 21నుంచి కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తి కొనుగోలు ప్రారంభిస్తుందని..ఇంతలో తొందరపడి రైతులెవరూ తమ పత్తిని దళారులకు విక్రయించి నష్టపోవద్దని రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి తెలిపారు. ఇవాళ సీసీఐ అధికారులతో ఫోన్ లో మాట్లాడటం జరిగిందని.. రాష్ట్రంలో పత్తి కొనుగోలు అంశాన్ని వారి దృష్టికి తీసుకువెళ్లామని పేర్కొన్నారు. గతేడాది పత్తి కొనుగోలులో జరిగిన లోపాల గురించి సీసీఐ అధికారులకు వివరించామని..

మిగతా 2లో

## ముగిసిన దామోదర్ రెడ్డి అంత్యక్రియలు

### అభిమానుల కన్నీటి వీడ్కోలు

వివరాలు 2లో



## ఆర్టీసీ బాదుడు

### పెరిగిన సిటీ బస్ ఛార్జీలు రేపటి నుంచి అమల్లోకి..

**హైదరాబాద్, మహా:** సిటీ బస్ చార్జీలను పెంచుతూ ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది. పెంచిన ఛార్జీలు సోమవారం నుంచి అమల్లోకి వస్తాయని సంస్థ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. నగరంలో కాలుష్యం తగ్గించేందుకు సంస్థ ఎలక్ట్రిక్ బస్సులను సంకూర్చుకుంటున్నందున

మిగతా 2లో

# జూబ్లీహిల్స్ తెరపై కొత్త ముఖాలు

**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ బైపోల్ వ్యవహారం అధికార పార్టీని టెన్షన్ పెడుతోంది..! పార్టీలో ఆశావాహులు రోజురోజుకు పెరుగుతుండటంతో.. టికెట్ ఎవరికి ఇవ్వాలనే విషయంలో ఆచీతూచీ అడుగులు వేస్తోంది. గెలుపు గుర్రానికే టికెట్ ఇవ్వాలని అధికార పార్టీ ఫిక్స్ అయ్యింది. అందుకే నియోజకవర్గంలో వరుస సర్వేలు నిర్వహిస్తున్నారు. మొదట నవీన్ యాదవ్, అంజన్ కుమార్ యాదవ్, బొంతు రామ్మోహన్, కంజర్ల విజయలక్ష్మి పేర్లు వినిపించాయి.. అయితే వీరంతా కూడా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని తట్టుకుని నిలబడతారా..! గెలిచే అవకాశాలు ఏమేరకు ఉన్నాయనే కోణంలో కాంగ్రెస్ పార్టీ లెక్కలు వేసుకుంటోంది. అందుకే రకరకాల ప్రయోగాలు చేస్తూ, అందరినీ గ్రౌండ్ లో తిప్పుతూ సర్వేలు చేస్తోంది. మరోవైపు మంత్రులను కూడా తమ ప్రాధాన్యతలు, గెలుపు గుర్రాలు ఎవరో చెప్పాలంటూ సీఎం రేవంత్ రెడ్డి స్పెషల్ టాస్క్ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఇప్పటికే మాగంటి సునితను ప్రకటించిన నేపథ్యంలో తాజా పరిస్థితిపై సీఎంకు నివేదిక అందింది. అందులో పార్టీపరంగా ఎలా ఉంది? అభ్యర్థి పరంగా ఎలా ఉంది? అన్న అంశాలపై సర్వే నిర్వహించారు.

**గెలుపు గుర్రాలు.. కొత్త ముఖాలు**

జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో పోటాపోటీగా నేతల ఫ్లెక్సీలు కనబడుతున్నాయి. కంజర్ల విజయలక్ష్మి, బొంతు రామ్మోహన్, నవీన్ యాదవ్, సీఎన్ రెడ్డి, అంజన్ కుమార్ యాదవ్ ల ఫ్లెక్సీలు జోరుగా కనిపిస్తున్నాయి. అయితే మాగంటి సునిత సామాజిక వర్గానికే చెందిన కీలక నేత, గతంలో జూబ్లిహిల్స్ టికెట్ ఆశించిన బండి రమేష్ పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. గతంలో బీఆర్ఎస్ పార్టీ తరుపున సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్ ఛార్జిగా పనిచేసిన బండి రమేష్ కు ఒక దశలో జూబ్లిహిల్స్ బీఆర్ఎస్ టికెట్ ను ఆఫర్ చేశారు. ఆ మేరకు ఆయన గ్రౌండ్ వర్క్ కూడా చేశారు. అయితే తర్వాత మాగంటి గోపీనాథ్ టిడిపి నుండి బిఆర్ఎస్ లోకి రావడంతో లెక్కలు మారాయి. అయినా ఈ ప్రాంతంతో బండికి బలమైన సంబంధాలున్నాయి. వెంగళరావునగర్, మధురానగర్, బోరబండ, షేక్ పేట ప్రాంతాల్లో బండికి మంచి పరిచయాలున్నాయి. పార్టీ ఆదేశం మేరకు గత ఎన్నికల్లో కూకట్ పల్లి నుండి బరిలోకి దిగిన బండి రమేష్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అత్యంత సన్నిహితులు. ఇక మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి పేరు కూడా చర్చకు వచ్చింది. అనూహ్యంగా బలంగా వినబడుతోంది. దానం నాగేందర్, మైనంపల్లి హనుమంతరావు లాంటి పేర్లు కూడా ప్రచారంలోకి వచ్చాయి. హైకమాండ్ పరిశీలనలో గెలుపుగుర్రంగా ఎవరు తేలుతారో.. చూడాలి. ఈ వారంలోనే షెడ్యూల్ వచ్చే అవకాశం ఉండడంతో, షెడ్యూల్ వచ్చిన వెంటనే అభ్యర్థిని ఖరారుచేసే అవకాశాలున్నాయి.

# ఆర్టీసీ బాదుడు

(మొదటిపేజీ తరువాయి)

మౌలిక సదుపాయాల కల్పన కోసం ఛార్జీలు పెంచక తప్పడం లేదని సంస్థ పేర్కొంది. హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల 2027 నాటికి 2800 ఎలక్ట్రిక్ బస్సులను డీజిల్ బస్సుల స్థానే ప్రవేశ పెట్టాలని నిర్దేశించింది. నగరంలోని ప్రజా రవాణా వ్యవస్థను క్లీన్ అండ్ గ్రీన్ దిశగా నడిపించేందుకు ఈ నిర్ణయం ఒక శుభ సంకేతం. పర్యావరణ పరిరక్షణలో ఇది విప్లవాత్మక అడుగు. పూర్తిస్థాయిలో 2800 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు వినియోగంలోకి వస్తే వ్యక్తిగత వాహనాల కొనుగోళ్లు తగ్గడంతో పాటు ప్రజా రవాణా వినియోగం పెరుగుతోంది. ఫలితంగా వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలు తగ్గుతాయి. నగరవాసులకు శ్వాసకోశ సమస్యలు, గుండె జబ్బులు తగ్గి.. ప్రజల ఆయుర్దాయం మెరుగుపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో 2800 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చుకునేందుకు టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే చర్యలు చేపట్టింది. రాబోయే రెండేళ్లలో దశల వారీగా ఎలక్ట్రిక్ బస్సులను వాడకంలోకి తెచ్చేలా ప్రణాళిక రూపొందించింది. ఎలక్ట్రిక్ బస్సులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకుంటోంది. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ లో 25 డిపోలున్నాయి. అందులో 6 డిపోల పరిధిలో 265 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా.. ఈ ఏడాదిలో మరో 275 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వస్తున్నాయి. ఒక్కో డిపోలో రూ.8 కోట్ల వ్యయంతో పూర్తిస్థాయిలో చార్జింగ్ కోసం హెచ్‌టీ కనెక్షన్లను టీజీఎస్పీడీసీఎల్, ట్రాన్ కో ద్వారా నిర్మించింది. రాబోయే 2800 కొత్త ఎలక్ట్రిక్ బస్సుల కోసం 19 డిపోల్లో చార్జింగ్ కోసం హెచ్‌టీ కనెక్షన్లను సంస్థ ఏర్పాటు చేయనుంది. అలాగే, ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా హైదరాబాద్ లో ప్రజా రవాణాను మరింతగా విస్తరించేందుకు కొత్తగా 10 డిపోలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అలాగే, కొత్తగా 10 చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనుంది. ఈ మౌలిక సదుపాయాలకు రానున్న సంవత్సరంలో రూ.392 కోట్ల మేర వ్యయమవుతుందని టీజీఎస్ఆర్టీసీ అధికారులు అంచనా వేశారు. టీజీఎస్ఆర్టీసీ ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ ఆర్థిక భారాన్ని మోయలేదు. ప్రభుత్వం, ప్రజల సహకారంతో ఈ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటోంది.

ఈ నేపథ్యంలోనే ఎలక్ట్రిక్ బస్సుల మౌలిక సదుపాయాల వ్యయాన్ని సమకూర్చుకునేందుకు సిటీ బస్సుల్లో అదనపు ఛార్జీని విధించేందుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను సెప్టెంబర్ 23న రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నడిచే అన్ని బస్సుల్లో అదనపు ఛార్జీని సంస్థ వసూలు చేయనుంది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈఆర్డినరీ, ఈఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మొదటి మూడు స్టేజిలకు రూ.5, 4వ స్టేజి నుంచి రూ.10 అదనపు ఛార్జీని సంస్థ విధించనుంది. అలాగే మెట్రో డీలక్స్, ఈమెట్రో ఏసీ సర్వీసుల్లో మొదటి స్టేజీకి రూ.5, రెండో స్టేజీ నుంచి రూ.10 అదనపు ఛార్జీని వసూలు చేయనుంది. హైదరాబాద్ సిటీ బస్సుల్లో ఈ అదనపు చార్జీ అమలు ఈ నెల 6(సోమవారం) నుంచి అమల్లోకి వస్తుందని అధికారులు తెలిపారు.

## టెక్సాస్‌లో తెలుగు యువకుడు మృతి

**నల్లజాతీయుడి కాల్పుల్లో పోలే చంద్రశేఖర్ మృతి**

**సంతాపం తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**ఇంటర్నెట్ డెస్క్, మహా:** అమెరికాలో దారుణం చోటుచేసుకుంది. డల్లాస్‌లో జరిగిన కాల్పుల్లో 27 ఏళ్ల తెలుగు యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. గురువారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్‌కు చెందిన పోలే చంద్రశేఖర్ డెంటల్ సర్జరీలో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశాడు. ఉన్నత చదువుల కోసం 2023లో అమెరికా వెళ్లాడు. ఆరు నెలల క్రితం మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాడు. ఉద్యోగం కోసం ఎదురు చూస్తూ ఉన్నాడు. ఓ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లో పార్ట్‌టైమ్ చేస్తున్నాడు. గురువారం రాత్రి అతడు డ్యూటీలో ఉండగా ఊహించని దారుణం జరిగింది. ఓ వ్యక్తి అకస్మాత్తుగా చంద్రశేఖర్‌పై కాల్పులకు తెగబడ్డాడు. బుల్లెట్ గాయాల కారణంగా చంద్రశేఖర్ చనిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చంద్రశేఖర్ మరణం గురించి తెలిసి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తమ బిడ్డ మృతదేహాన్ని ఇండియాకు తీసుకువచ్చేందుకు సాయం చేయాలని మృతుడి తల్లి దండ్రులు ప్రభుత్వాన్ని కోరారు. ఆయన మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు.

## జూబ్లీహిల్స్‌లో గెలిచేది మేమే

నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత సీఎం తీసుకున్నారు

పిల్లలతో వచ్చి సానుభూతిని పొందాలనుకోవడం దారుణం

మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, మహా :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ దే గెలుపని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఉద్ఘాటించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎన్నికల మాదిరిగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ అధికార కాంగ్రెస్‌ని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల మాదిరిగా తమ ప్రభుత్వం పని చేస్తోందని వ్యాఖ్యానించారు. శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎర్రగడ్డ డివిజన్‌లో రూ. 2.16 లక్షలతో సీసీ రోడ్లకు, కమ్యూనిటీ హాల్‌కి శంకుస్థాపన చేశామన్నారు. రూ.54 లక్షలతో మురుగు నీటి కాలువల పునరుద్ధరణకు శంకుస్థాపన చేశామని వెల్లడించారు. దీని పక్కన ఉన్న స్థలంలో ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడే విధంగా పార్క్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఆదివారం నుంచే పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. వాకింగ్ ట్రాక్, పిల్లల గేమ్స్ ఆడుకోవడానికి, తదితర ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రింకింగ్ వాటర్, శానిటేషన్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హైదరాబాద్‌లో 60 వేలకు పైగా నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశామని మంత్రి గుర్తు చేశారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ , రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. కొంత మంది పిల్లలను తీసుకొచ్చి సానుభూతితో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓట్లు అడగాలని చూస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి మాత్రమే ప్రజలు పట్టం కడతారని ఉద్ఘాటించారు. జూబ్లీహిల్స్‌ని అభివృద్ధి చేసే బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్నారని నొక్కిచెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ఇక్కడ కూడా డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. తమ ప్రభుత్వంలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## బాహుబలి కోసం రంగంలోకి అనుష్క శెట్టి

**మహా:** బాహుబలికి ఎంత క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా బాహుబలి ఎపిక్ పేరుతో రెండు సిరీస్ లను కలిపి రిలీజ్ చేస్తున్నారు. ఈ రెండు పార్టులను కలిపేందుకు జక్కన్న ఎడిటింగ్ రూమ్ నుంచి బయటకు రావట్లేదు. అన్నీ దగ్గరుండి చూసుకుంటున్నాడు. బాహుబలి కోసం అనుష్కశెట్టిని రంగంలోకి దించుతున్నాడంట జక్కన్న. ఆమె ఘాటీ ప్రమోషన్లకు చాలా దూరంగా ఉంది. దానికి రకరకాల కారణాలు వినిపించాయి. కానీ ఇప్పుడు బాహుబలి కోసం ఆమెను బయటకు తీసుకురావడం కూడా సంచలనంగానే మారుతుందని జక్కన్న భావిస్తున్నాడు. మళ్లీ బాహుబలి సిరీస్ నాటి రోజులను ఇండస్ట్రీలో క్రియేట్ చేయాలన్నది రాజమౌళి ప్లాన్. వ్యూహాలు పన్నడంలో రాజమౌళి దిట్ట. మరి ఈ సారి ఎలాంటి ప్రమోషన్లతో అదరగొడుతాడో చూడాలి.

## టీమిండియా వన్డే కెప్టెన్‌గా గిల్

రోహిత్ కెరీర్ ముగింపు దశకు రావడంతో యువ ప్లేయర్‌కు పగ్గాలు

కొంతకాలంగా జట్టుకు దూరంగా ఉంటున్న శ్రేయస్‌కు వైస్ కెప్టెన్‌గా ప్రమోషన్

**స్పోర్ట్స్, మహా:** ఆస్ట్రేలియాతో జరిగే వన్డే, టీ20 సిరీస్‌లకు చెందిన భారతీయ జట్టును ప్రకటించారు. టీమిండియా వన్డే జట్టుకు శుభమన్ గిల్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టనున్నాడు. ఇక టీ20 సిరీస్ మ్యాచ్‌లకు సూర్యకుమార్ యాదవ్ సారథ్య బాధ్యతలను నిర్వర్తిస్తాడు. ఆస్ట్రేలియా, ఇండియా మధ్య మూడు వన్డేలు, అయిదు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. అక్టోబర్‌నవంబర్ నెలల్లో ఆ మ్యాచ్‌లు ఉంటాయి. సీనియర్స్ మెన్స్ సెలక్షన్ కమిటీ భారత బృందాన్ని ఎంపిక చేసింది. అయితే వన్డేల్లో సీనియర్ క్రికెటర్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి ఛాన్స్ దక్కింది. ఆ ఇద్దర్నీ ఆసీస్‌తో సిరీస్‌కు ఎంపిక చేశారు. ఇక వైస్ కెప్టెన్సీ బాధ్యతలను శ్రేయాస్ అయ్యర్‌కు అప్పగించారు. వన్డేలకు వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్ ఎంపికయ్యాడు. వన్డే టీమ్‌లో నితీశ్, సుందర్, కుల్దీప్, హర్షిత్ రాణా, సిరాజ్, అర్షదీప్, ప్రసిద్ధ కృష్ణ, ధ్రువ్ జురెల్ , జైస్వాల్ కూడా ఉన్నారు. ఆసీస్‌తో జరిగే టీ20 సిరీస్‌కు సూర్యకుమార్ యాదవ్ సారథ్య బాధ్యతలు చేపట్టనున్నాడు. ఆ జట్టులో అభిషేక్ శర్మ, గిల్, తిలక్ వర్మ, నితీశ్, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, వరుణ్ చక్రవర్తి, బుమ్రా, అర్షదీప్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, సంజూ సాంసన్, రింకూ సింగ్, సుందర్ ఉన్నారు. అయితే వన్డే జట్టుకు స్పీడ్ బౌలర్ బుమ్రాను ఎంపిక చేయలేదు.

# రెండు నెలల్లో ఉత్తర భాగం రీజినల్ రింగ్ రోడ్డు టెండర్ ప్రక్రియ ప్రారంభం

- డిసెంబర్ లోపు టెండర్లు పూర్తి
- జనవరిలో పనులు ప్రారంభించేలా చేస్తాం
- దక్షిణ భాగం విషయంలో రైతులు ఆందోళన చెందొద్దు
- రైతులకు అన్యాయం చేయం
- రోడ్లను అమ్ముకున్న పాపం బిఆర్ఎస్ దే
- వాళ్లే..అబద్ధపు ప్రచారాలతో రైతులను గందరగోళానికి గురిచేస్తున్నారు..
- మీడియాతో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**చిట్యాల, మహా :** రెండు నెలల్లో రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం టెండర్ ప్రక్రియ ప్రారంభం కానుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. డిసెంబర్ లోపు టెండర్లు పూర్తి చేసి జనవరిలో పనులు ప్రారంభించేలా చేస్తామని చెప్పారు. శనివారం మంత్రి చిట్యాలలో మీడియాతో మాట్లాడారు. 2017 18 లో ప్రధాని మోదీ ఉత్తర భాగం రీజినల్ రింగ్ రోడ్డుకు అంగీకరిస్తే..బిఆర్ఎస్ ప్రభుత్వం భూ సేకరణ చేయకుండా నిర్లక్ష్యం వహించిందని మంత్రి మండిపడ్డారు. తాను ఎంపీగా ఉన్నపుడు రైతులకు అన్యాయం జరగకుండా ధర్నాలో పాల్గొని, ప్రజా ప్రభుత్వం వచ్చి మంత్రి అయిన తర్వాత మార్కెట్ రేట్ ఇప్పించి రైతులను ఒప్పించానన్నారు. తాను మంత్రిగా అయిన కొత్తలో 6శాతం భూసేకరణ మాత్రమే అయితే రైతులను ఒప్పించి ఇప్పుడు 98శాతం పైగా పూర్తి చేసామని చెప్పారు. 4లేన్ల ట్రిబుల్ ఆర్ 2035 నాటికి ట్రాఫిక్ రద్దీ పెరుగుతుందని, భవిష్యత్ అవసరాల దృష్ట్యా 6లేన్లుగా మార్చుకున్నామని తెలిపారు. సంగారెడ్డి నుండి నర్సాపూర్,తూప్రాన్, గజ్వేల్,జగదేవపూర్ వయా భువనగిరి,చౌటుప్పల్ వరకు 161.518కిలో మీటర్ల నార్త్ పార్ట్ ఉండనుందని అన్నారు. భూసేకరణ కోసం 6వేల కోట్లు ఖర్చు అవుతున్నాయని కేంద్రం,రాష్ట్రం చెరిసగం వాటా ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా 3వేల కోట్లు హడ్కో రుణం తెచ్చామని అన్నారు. ఇప్పటికే పలు మార్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిశామని,ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,తాను కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమావేశం అయ్యామని పనులు వేగం చేసేలా మాట్లాడామని చెప్పారు. ఉత్తర భాగం అలైన్మెంట్ లో ఎలాంటి మార్పు ఉండదని,జనవరిలో పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. అందుకు కేంద్రం సహకరించాలని కోరారు.

**దక్షిణ భాగం రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో ఆందోళన వద్దు**

దక్షిణ భాగం విషయంలో రైతుల అనవసర ఆందోళన చెందొద్దని మంత్రి భరోసా కల్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఆర్ అండ్ బి మినిస్టర్ అయిన తాను రైతుల అంగీకారంతోనే ముందుకు పోతామని తేల్చిచెప్పారు. "నేను రైతు బిడ్డను..రైతుకు అన్యాయం జరిగితే ఊరుకుంటానా" అంటూ త్వరలోనే ముఖ్యమంత్రితో మాట్లాడి మంత్రుల కమిటీ వేస్తామని తనను కలిసిన రైతులకు హామీ ఇచ్చారు. అయితే ఇటీవల పత్రికల్లో,సోషల్ మీడియాలో రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో అసత్య ప్రచారం చేస్తున్నారని రైతులు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అక్కర్లేదన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ,నిర్మాణం కోసం 45వేల కోట్ల వరకు ఖర్చు అవుతుంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కట్టిన,ఇప్పుడు లక్షన్నర కోట్ల విలువ గల ORR ను 7వేల కోట్లకు అమ్ముకున్న బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నదని,చరిత్రలో రోడ్లను అమ్ముకున్న పాపం బిఆర్ఎస్ ది మాత్రమేనని దుయ్యబట్టారు. రోడ్లు అమ్ముకున్న వాళ్లే..అబద్ధపు ప్రచారాలతో రైతులను గందరగోళానికి గురిచేస్తున్నారనీ, వాళ్ల ట్రాప్ లో పడొద్దని రైతులను కోరారు. వాళ్ళు ఒక్క ఇల్లు కట్టలే,రేషన్ కార్డు ఇయ్యలే,సన్న బియ్యం ఇయ్యలే,ఇంటికి ఉచిత కరెంట్ ఇయ్యలే కానీ లక్షల కోట్లు అప్పులు మాత్రం చేసారని ఎద్దేవా చేశారు.

నితిన్ గడ్కరీ వ్యక్తిగతంగా తనను ఇష్టపడే వ్యక్తని తన పేరు చెప్పి గౌరెల్లి భద్రాచలం హైవే,ఎల్బీనగర్ మల్కాపురం రోడ్డు జీవో ఇచ్చారని గుర్తు చేశారు. హైదరాబాద్ విజయవాడ హైవే 8లేన్ల నిర్మాణ పనులు వచ్చే ఫిబ్రవరిలో ప్రారంభం అవుతాయని మరోమారు స్పష్టం చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో ఎవరు ఆందోళన చెందాల్సిన అక్కర్లేదనీ,రైతులు ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. అలైన్మెంట్ విషయంలో పెద్ద వాళ్ళకు ఒక న్యాయం ,పేద వాళ్లకు ఒక న్యాయం ఉండదని అందులో ఎలాంటి అనుమానం అవసరం లేదని తేల్చి చెప్పారు. "నల్లగొండ బిడ్డగా..ఈ గడ్డకు అన్యాయం జరిగితే ఊరుకోను" అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పునరుద్ఘాటించారు.

## రూ.75లకే జియో బంపర్ రీఛార్జ్ ప్లాన్

**అన్‌లిమిటెడ్ బెనిఫిట్స్**

**మహా:** ప్రముఖ టెలికాం సంస్థ రిలయన్స్ జియో యూజర్లకు అదిరిపోయే గుడ్ న్యూస్. అతి తక్కువ ధరలోనే రీఛార్జ్ ప్లాన్‌లు అందుబాటులో ఉన్నాయి. కేవలం రూ.100లోపు ధరను కలిగి ఉన్న ఈ ప్లాన్‌లలో అన్‌లిమిటెడ్ వాయిస్ కాల్స్, డేటా, ఎస్ఎంఎస్‌తో పాటు మరిన్ని ప్రయోజనాలు పొందొచ్చు. ఫ్రీ జియో టీవీ యాక్సెస్ కూడా లభిస్తుంది. అదిరిపోయే రీఛార్జ్ ప్లాన్‌లను ప్రకటించింది. రూ. 75లకే 23రోజుల వ్యాలిడిటీతో వస్తుంది. ఇందులో అన్‌లిమిటెడ్ కాల్స్, sms, డేటా, జియో టీవీ యాక్సెస్ వంటి బెనిఫిట్స్ పొందొచ్చు. అలాగే రూ.91, రూ.125, రూ.152, రూ.186, రూ.223 రీఛార్జ్ ప్లాన్‌లున్నాయి.

# సుప్రీంకు స్థానికం

(మొదటిపేజీ తరువాయి)

అక్టోబరు 6న దీనిని విచారించనుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించినప్పటికీ, సుప్రీంకోర్టు తీర్పు ఈ ప్రక్రియపై ప్రభావం చూపే అవకాశం ఉంది. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ఇచ్చిన జీవో నంబర్ 9 విషయంలో హైకోర్టు, సుప్రీంకోర్టులు ఏం చెప్పబోతున్నాయి? జీవో అమలుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తాయా లేక బ్రేకులు వేస్తాయా అనేది ఉత్కంఠగా మారింది. ఇప్పటికే హైకోర్టులో కేసు విచారణపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆశావహులు ఉత్కంఠతో ఉండగా తాజాగా సుప్రీంకోర్టులో పిటిషన్‌తో పరిస్థితి మరింత ఉత్కంఠగా మారింది.

**గందరగోళం**

సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఒకవేళ స్థానిక సంస్థల ఎన్నికలను నిలిపివేయాలని హైకోర్టు ఆదేశాలిస్తే అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఎలా ముందుకు వెళతాయనే చర్చ నడుస్తున్నది. షెడ్యూల్ విడుదల చేసినందున ఎన్నికల ప్రక్రియ కొనసాగాలని కోర్టు ఆదేశిస్తే స్థానిక సంస్థలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇక మరోవైపు స్థానిక సంస్థలకు రిజర్వేషన్ల విషయంలో గందరగోళం నెలకొందనే ప్రచారం కూడా తెరమీదికి వచ్చింది. ఈ రిజర్వేషన్లలో శాస్త్రీయత లేదని విపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. ఈ రిజర్వేషన్లను సరిచేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ రిజర్వేషన్లలో గందరగోళంపై కోర్టును ఆశ్రయించాలని పార్టీలు యోచిస్తున్నాయి. 6వ తేదీన తీర్పును బట్టి గందరగోళంపై ముందుకెళ్ళనున్నాయి.



**ప్రతిష్ఠాత్మకం**

తెలంగాణలో ఇటీవల అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల విజయం తర్వాత, గ్రామీణ స్థాయిలో తమ పట్టును నిరూపించుకోవడానికి ఈ ఎన్నికలు కాంగ్రెస్‌కు కీలకం. ముఖ్యంగా.. అధికార మార్పిడి తర్వాత సంక్షేమ పథకాల అమలును ప్రజలు ఎలా అంచనా వేస్తున్నారో తెలుసుకోవడానికి ఈ ఎన్నికలు ఒక పరీక్షగా మారనున్నాయి. అందుకే వ్యూహాత్మకంగా ఎన్నికలకు రెడీ అయింది.

## తెలంగాణలో ఈనెల 21 నుంచి పత్తి కొనుగోలు

(మొదటిపేజీ తరువాయి)

ఈ ఏడాది సీసీఐ కొనుగోళ్లలో దళారులు ప్రవేశించకుండా చూడాలని కోరడం జరిగిందన్నారు. రాష్ట్రంలో పత్తి ధర క్వింటాలుకు మార్కెట్‌లో రూ.6,700 మాత్రమే ఉందని, అది సీసీఐ మద్దతు ధర 8,110 కంటే రూ.1,410 తక్కువగా ఉందన్నారు. రైతులు సీసీఐకి పత్తి విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు. మరోవైపు సీసీఐ పత్తి కొనుగోలు ప్రక్రియ వాస్తవానికి అక్టోబర్ 1నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. అయితే పత్తి కొనుగోలు, ఆ తర్వాత శుద్ధి చేసి బేళ్లుగా కట్టి రవాణా చేసే పని కోసం సీసీఐ పిలిచిన జాబ్‌వర్క్ టెండర్లకు మిల్లర్లు ముందుకు రాలేదు. రెండుసార్లు టెండర్లు పిలిచిన ఎవరు ముందుకు రాలేదు. దీంతో కొనుగోలు ప్రక్రియలో ప్రతిష్టంభన ఏర్పడింది. నిబంధనలు మారిస్తేనే టెండర్లలో పాల్గొంటామని మిల్లర్లు చెబుతున్నారు. గత సంవత్సరం అమలైన విధానాన్నే కొనసాగించాలని వారు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు.. సీసీఐ టెండర్ల సమస్యను పరిష్కరించేందుకు తీసుకునే చర్యలపైనే పత్తి కొనుగోలు ప్రక్రియ ఆధారపడి ఉందన్న చర్చ సాగుతోంది.

## ఛత్ పండుగ తర్వాతే బీహార్ ఎలక్షన్స్

**ఈసీని కోరిన రాజకీయ పార్టీలు**




(మొదటిపేజీ తరువాయి)

పట్నా వెళ్లిన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ సారథ్యంలోని ఈసీ బృందాన్ని 6 జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీల నేతలు కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.

**ఒకటి లేదా రెండు విడతల్లో**

ఈసీని కలిసిన రాజకీయ పార్టీల నేతలు ఈసారి తక్కువ విడతల్లో పోలింగ్ నిర్వహించాలని కోరారు. వీలైతే ఒకటి లేదా రెండు విడతల్లో పోలింగ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అయితే మహారాష్ట్ర మాదిరిగా బీహార్‌లోనూ ఒకే విడతలో పోలింగ్ జరపాలని జేడీయూ నేతలు విజ్ఞప్తి చేశారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన బీహారీలు దీపావళి, ఛత్ పండుగలకు స్వస్థలాలకు తిరిగి వస్తారని, అప్పుడు పోలింగ్ నిర్వహించటం వల్ల ఓటింగ్ శాతం పెరుగుతుందని వారు అన్నారు. బిహార్‌లో నిర్వహించే ముఖ్యమైన పండుగల్లో ఛత్ ఒకటి. ఈ పండుగను దీపావళి తర్వాత 6 రోజులకు జరుపుకొంటారు.

**ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలు**

ఆర్‌జేడీ కూడా ఛత్, దీపావళి తరువాత ఎన్నికలు నిర్వహించాలని కోరింది. లేకుంటే ప్రజలు అసౌకర్యానికి గురవుతారని ఈసీకి తెలిపింది. ఆర్‌జేడీ ఎంపీ అభయ్ కుశ్వాహా మాట్లాడుతూ, బిహార్‌లో ఎస్ఐఆర్ చేపట్టి ఓటర్ జాబితా నుంచి ఏకంగా 3,66,000 ఓటర్లను తొలగించారని, దీనిపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని అన్నారు. తొలగించిన ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచాలని ఈసీని ఆయన కోరారు. ఇక బుర్ఖాలు ధరించి వచ్చే మహిళలను, వారి ఓటరుకార్డులను సరిగ్గా తనిఖీ చేయాలని బీజేపీ నేతలు ఈసీ బృందాన్ని కోరారు. అంతేకాదు ఓటింగ్ పూర్తైన తరువాత పోలింగ్ ఏజెంట్లు ఫారమ్ 17సీ సేకరించేలా చూడాలని, దీని వల్ల ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగిందో లేదో తెలుస్తుందని, ఈవీఎంలపై ఉన్న సందేహాలు కూడా తొలగిపోతాయని చెప్పారు.





# ముగిసిన దామోదర్ రెడ్డి అంత్యక్రియలు

**అభిమానుల కన్నీటి వీడ్కోలు**

**సూర్యాపేట, మహా :** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అంత్యక్రియలు ముగిశాయి. తుంగతుర్తిలోని వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. భారీగా నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి నివాళులర్పించారు. దామోదర్ రెడ్డి భౌతికకాయంపై కాంగ్రెస్ పార్టీ జెండాను పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కప్పి నివాళులు అర్పించారు. అంత్యక్రియల కార్యక్రమాల్లో పీసీసీ చీఫ్ తో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు, నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. టైగర్ దామన్నకు కన్నీటి వీడ్కోలు పలికారు.




## ఎన్నికల సామాగ్రి పరిశీలించిన కలెక్టర్

**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల సామాగ్రిని శనివారం నాడు జిల్లా కలెక్టర్ హనుమంతరావు పరిశీలించారు. స్థానిక సంస్థల ఎన్నికలకి అధికారులు సిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. ఎన్నికల సంఘం నియమాలకు అనుగుణంగా ఉండాలన్నారు. నామినేషన్ పత్రాలు వచ్చాయా , నామినేషన్ కేంద్రాలు సిద్ధంగా ఉంచుకోవాలి ఎన్నికలలో పాల్గొనే అధికారులకు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పరిశీలించిన కలెక్టర్

**యాదాద్రి భువనగిరి, మహా:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు లబ్ధిదారులను కోరారు. శనివారం అడ్డగూడూరు మండలం కాంచనపల్లి, చౌళ్ల రామారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేసుకోవాలన్నారు , ఇంకా చిన్న చిన్న పనులు ఉంటే కూడా త్వరగా పూర్తి చేసుకోవాలి అని తెలిపారు.ఏఈ లు ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి అయిన వెంటన్ ఫోటో కాప్చర్ చేయాలని సూచించారు. అనంతరం అడ్డగూడూరు మండలం చౌళ్లరామారం గ్రామంలో పల్లె దవాఖానను ఆకస్మిక తనిఖీ చేశారు.. కలెక్టర్ ఉత్తర్వులు లేకుండా ఎం ఎల్ ఎచ్ పి కి డిప్యుటేషన్ ఇచ్చిన అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు ఆకస్మిక తనిఖీ లో పల్లె దవాఖాన లో లేని ఎం ఎల్ ఎచ్ పి, దవాఖాన లో విధులు నిర్వహిస్తున్న ఆశ కార్యకర్త. ఆస్పత్రికి వచ్చే పేషెంట్లకు వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు.



## అన్‌క్లెయిమ్డ్ సొత్తు రూ.1.84 లక్షల కోట్లు

- మొత్తం అర్హులకు అందేలా అధికారులు చూడాలి
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**ఢిల్లీ, మహా:** ఎవరూ క్లెయిమ్ చేయకుండా ఉన్న నగదు బ్యాంకులు, నియంత్రణ సంస్థల వద్ద రూ.1.84లక్షల కోట్లు ఉన్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. సదరు మొత్తం అర్హులకు అందేలా అధికారులు చూడాలన్నారు. కేంద్రమంత్రి గుజరాత్ గాంధీనగర్‌లో మూడులల పాటు జరిగే 'మీ సొమ్ము-మీ హక్కు' పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. గుజరాత్ ఆర్థిక మంత్రి కనుభాయ్ దేశాయ్, బ్యాంకులు, ఆర్థిక మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవగాహన, ప్రచారం, యాక్షన్ అనే మూడు అంశాలపై పని చేయాలని.. అప్పుడు అన్‌క్లెయిమ్ సొమ్ము సరైన లబ్ధిదారులకు చేరుతాయన్నారు. బ్యాంకు డిపాజిట్లు, బీమా, ప్రావిడెండ్ ఫండ్, షేర్లు తదితర రూపాల్లో బ్యాంకులు, ఇతర నియంత్రణ సంస్థల వద్ద రూ.1.84 లక్షల కోట్ల నిధులు మూలుగుతున్నాయన్న ఆర్థిక మంత్రి.. మొత్తాన్ని మూడునెలల్లో అర్హులకు చేరేలా అధికారులే చొరవ చూపాలన్నారు.మొత్తం భద్రంగా ఉందని, సరైన పత్రాలు పత్రాలు అందించి నగదును తీసుకోవాలని ఆమె పౌరులకు సూచించారు. ఈ విషయంలో ప్రభుత్వం కస్టోడియన్‌గా వ్యవహరిస్తుందన్నారు. క్లెయిమ్ కాని నిధులు బ్యాంకులు, ఆర్‌బీఐ, ఐఈపీఎఫ్‌లో ఉన్నాయని.. అవసరమైన పత్రాలు సమర్పించిన తర్వాత తిరిగి వాటిని పొందవచ్చన్నారు.

# ప్యారడైజ్ టు శామీర్‌పేట్ ఎలివేటెడ్ కారిడార్

### నవంబర్ లో పనులు ప్రారంభం.. అంచనా వ్యయం రూ.2,232 కోట్లు.. ఖరారైన టెండర్లు



**హైదరాబాద్, మహా :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎలివేటడ్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అన్ని సమస్యలు, ఇబ్బందులు తొలగిపోయాయి. దీంతో ప్రభుత్వం త్వరలోనే దీని నిర్మాణ పనులను ప్రారంభించనుంది. ఈ ఎలివేటెడ్ కారిడార్‌ని ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ వరకు రూ.2,232 కోట్ల ఖర్చుతో నిర్మించ తలబెట్టిన ఈ ప్రాజెక్ట్ త్వరలోనే పట్టాలు ఎక్కనుంది. అన్ని అడ్డంకులు తొలగిపోయి త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి డెయిరీ ఫామ్ రోడ్డు వరకు నిర్మించతలబెట్టిన కారిడార్ 1కు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. ఈ కారిడార్ నిర్మాణానికి అవసరమైన సాయిల్‌టెస్టులు కూడా జరుగుతున్నాయి. జేబీఎస్, ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ వరకు నిర్మించాలని భావిస్తున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి 90 శాతం భూసేకరణ పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. నవంబరు నెలాఖరు నాటికి ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించేందుకు హెచ్‌ఎండీఏ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ ప్రారంభం అయ్యింది. ఈనెల 22 వరకు టెండర్లు ఆహ్వానిస్తారు. ఎంపికైన కంపెనీకి నవంబర్ నెల చివరలో పనులు ప్రారంభిస్తారని హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు.

**రూ.2,232 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్–2**

ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ ఎలివేటెడ్ కారిడార్-2 ను జేబీఎస్ నుంచి హకీంపేట మీదుగా శామీర్‌పేట్ ట్రిపుల్ ఆర్ వరకు నిర్మించనున్నారు. కారిడార్ మధ్యలో హకీంపేట వద్ద 445 మీటర్ల మేర అండర్‌గ్రౌండ్ టన్నెల్‌ను నిర్మించబోతున్నారు. కారిడార్ నిర్మించే ప్రాంతం మిలీటరీ ఏరియా కావడంతో.. భద్రతా కారణాలను దృష్టిలో పెట్టుకుని అండర్‌గ్రౌండ్ టన్నెల్ నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. 18.10 కిలోమీటర్ల మేర నిర్మించే ఈ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్ట్‌కు 197 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంటుందని అధికారుల అంచనా వేస్తున్నారు. ఈమొత్తం భూమిలో 113 ఎకరాలు రక్షణ శాఖకు చెందిన భూములు కాగా, మిగతా 84 ఎకరాలు ప్రైవేట్ భూములు సేకరిస్తున్నారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ, పరిహారాల చెల్లింపులతో కలిపి ఈ ప్రాజెక్ట్ కోసం రూ. 2,232 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ కారిడార్ నిర్మాణం కోసం మిలిటరీ ఎస్టేట్ భూములు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు చెందిన భూములను ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమమైంది. అలాగే ఎలివేటెడ్ కారిడార్-1 ప్రాజెక్టులో భాగంగా సికింద్రాబాద్ ప్యారడైజ్ నుంచి బోయిన్పల్లి డెయిరీఫామ్ రోడ్ వరకూ 5.32 కి.మీ. మేరకు డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. మొత్తం రూ.1,580 కోట్లతో ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌ను చేపడుతున్నారు.

## చర్చల్లేవ్.. లొంగిపోవాల్సిందే

- చర్చలు జరపాలని కోరుతున్నారు.. వారితో మాట్లాడటానికి ఏముంది?
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు



**బస్తర్, మహా:** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. మావోయిస్టులతో ఇక ప్రభుత్వం ఎటువంటి చర్చలు జరపదని, ఆయుధాలు వదిలేసి లొంగిపోయేందుకు ముందుకు వస్తే స్వాగతిస్తామన్నారు. ఆ విధంగా లొంగిపోయిన వారందరికీ ప్రభుత్వం నుంచి అందాల్సిన వివిధ ప్రయోజనాలు అందిస్తామని, పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. బస్తర్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన హోంమంత్రి 2026 మార్చి 31 నాటికి దేశం మావోయిస్టు రహితంగా మారుతుందని పునరుద్ఘాటించారు. మావోయిస్టులు తమతో చర్చలు జరపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారని.. ఇప్పుడు వారితో మాట్లాడడానికి ఏముందని ప్రశ్నించారు. బస్తర్ అంతటా ఉన్న మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో ఆయుధాలతో శాంతికి విఘాతం కలిగించే వారికి భద్రతా దళాలు తగిన సమాధానం ఇస్తాయని మావోయిస్టులను హెచ్చరించారు. మార్చి 31, 2026 తర్వాత ఇటువంటి గ్రామాల అభివృద్ధిని మావోయిస్టులు అడ్డుకోలేరని అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ అభివృద్ధి కోసం రూ.4లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించిందని..భవిష్యత్తులో మరిన్ని నిధులు మంజూరు చేస్తామని తెలిపారు.



## సీఎం రేవంత్ రెడ్డిపై ఏఐసీసీ నేత కన్హయ్యకుమార్ ఫైర్

- మా పార్టీ సీఎం అయినా మూర్ఖుడే అని వ్యాఖ్య
- టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో విమర్శలు

**మహా :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ కన్హయ్య కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి తమ పార్టీ ముఖ్యమంత్రి అయినప్పటికీ, ఆయన ఒక మూర్ఖుడని ఒక మీడియా ఛానల్‌కు ఇచ్చిన ముఖాముఖిలో విమర్శించారు. రేవంత్ రెడ్డి తెలివితక్కువగా మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. బీహార్ ప్రజలను కూలీలు అని వ్యాఖ్యానించడం సరికాదని కన్హయ్య కుమార్ అభిప్రాయపడ్డారు. దొంగతనం చేసిన వారిని దొంగలు అని, తెలివి లేకుండా మాట్లాడే వారిని మూర్ఖుడు అని అనడంలో తప్పేమీ లేదన్నారు. రేవంత్ రెడ్డి తమ పార్టీ ముఖ్యమంత్రి అయినా తాను భయపడనని, ఆయన మూర్ఖుడే అని కుండబద్దలు కొట్టారు. త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ కూడా రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. తెలంగాణలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డిని ఓడించి తీరతానని, రాహుల్ గాంధీ కూడా ఆయనను కాపాడలేరని శపథం చేశారు. తెలంగాణ ప్రజలకన్నా బీహార్ ప్రజల డీఎన్ఏ నాసిరకమని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. బీహారీలను అవమానించినందుకు రేవంత్ రెడ్డి మూల్యం చెల్లించుకోకతప్పదని ప్రశాంత్ కిశోర్ అన్నారు.

## ప్రశాంత్ కిషోర్ ఫెయిల్డ్ పొలిటికల్ అనలిస్ట్

### ప్రతి ఇంటర్వ్యూలో రేవంత్ పేరు వాడటం సరైన పద్ధతి కాదు

### జన్ సూరాజ్ పార్టీ చీఫ్ ప్రశాంత్ కిషోర్‌కు ఎంపీ చామల కిరణ్ కౌంటర్



**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఎన్నికల వ్యూహకర్త, జన్ సూరాజ్ పార్టీ చీఫ్ ప్రశాంత్ కిషోర్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఈ మేరకు ఆయన శనివారం ఎక్స్ వేదికగా ఒక వీడియో విడుదల చేశారు. 'భారతీయ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ఇతర రాజకీయ నాయకులపై విమర్శలతో రాజకీయాలు చేస్తూ మీరే గొప్పవారని భావిస్తూ భ్రమలో జీవిస్తున్నారు. మీరు కొన్ని రాష్ట్రాల్లో ఫెయిల్ అయిన పొలిటికల్ అనలిస్ట్, ఇప్పుడు "జన్ సూరాజ్" పార్టీతో బీహార్ ప్రజలను ఆకర్షించాలనుకుంటున్నారు కానీ మీ సిద్ధాంతాలు అక్కడి రాజకీయంలో పని చేయలేకపోతున్నాయి' అని తీవ్ర విమర్శలు చేశారు.

**ముఖ్యమంత్రులను విమర్శించడం సరైనది కాదు..**

ప్రజల దృష్టిని మీవైపునకు తిప్పుకోవడానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు ఎందుకు..? అని ఎంపీ చామల ప్రశ్నించారు. బీహార్ ఎన్నికల కోసం మాత్రమే ఇలా చేస్తూ ప్రతి ఇంటర్వ్యూలో రేవంత్ రెడ్డి పేరున వాడటం సరైన పద్ధతి కాదని సూచించారు. బీహార్ అభివృద్ధి కోసం ప్రణాళికలు చెప్పకుండా ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను విమర్శించడం సరైనది కాదని హితవు పలికారు. ప్రజల వలసలను తగ్గించడం, అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా సూచించారు. కాగా, తాజాగా ప్రశాంత్ కిషోర్ ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురించి కీలక వ్యాఖ్యలు చేశారు.

## రిటర్నింగ్ అధికారులకు శిక్షణ




**యాదాద్రి భువనగిరి, మహా :**ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులు,రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమైనదని, అధికారులు సమన్వయంగా పని చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకి సంబందించి, రిటర్నింగ్ అధికారులు,అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకి ఎన్నికల విధులు, బాధ్యత లు, నియమ నిబంధన ల పైన శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది, ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కభాస్కరరావులు పాల్గొన్నారఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన నియమ నిబంధనలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అధికారులు తమకు ఇచ్చిన హ్యాండ్‌బుక్‌ను క్షుణ్ణంగా చదివి ప్రతీ అంశంపై అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి బాధ్యత,రిటర్నింగ్ అధికారిదేనని, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ సిబ్బంది నియామకం, వారికి పోలింగ్ కు సంబంధించిన సామాగ్రి సమకూర్చడం మొదలగు ప్రతి అంశాలను క్షుణ్ణం గా పర్యవేక్షించాల్సి ఉంటుందన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ..స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో నామినేషన్ల ప్రక్రియ కీలకమైనదని అన్నారు. అదనపు కలెక్టర్ నామినేషన్లపై రిటర్నింగ్ అధికారులకు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు సూచనలు చేశారు. మాస్టర్ ట్రైనర్లు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, నిర్వహణ ప్రక్రియలో ఏమైనా సందేహాలు, అపోహలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, జిల్లా పరిషత్ సిఇఓ శోభారాణి, రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి,ఎన్నికల నిర్వహణకై వివిధ అంశాలకు కేటాయించిన ఆర్వో లు, ఏ ఆర్వో లు, ఎంపీడీవో లు మండల స్పెషల్ ఆఫీసర్ ఆఫీసర్లు, మండల్ లెవెల్ మాస్టర్ ట్రైనర్ లు పాల్గొన్నారు.

## మరో ఇద్దరి ఎమ్మెల్యేల విచారణ పూర్తి

- గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డిల క్రాస్ ఎగ్జామినేషన్
- స్పీకర్ గడ్డం ప్రసాద్ ఎదుట వాదనలు వినిపించిన లీడర్లు

**హైదరాబాద్, మహా:** ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో విచారణలు కొనసాగుతున్నాయి. శనివారం చేపట్టిన విచారణ ముగిసింది. విచారణలో భాగంగా పిటిషనర్ల తరఫున అడ్వకేట్లు.. ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డిలను క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎదుట ఎమ్మెల్యేలు తమ వాదనలు వినిపించారు. శనివారం ఉదయం నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చాంబర్లో విచారణ కొనసాగింది. ఈనెల 1వ తేదీన జగరగాల్సిన విచారణ వాయిదా పడటంతో.. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు నేడు విచారణకు హాజరయ్యారు. బీఆర్ఎస్‌లో గెలిచి పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యలో సుప్రీకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించింది. దీంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని గడువు విధించింది. ఈ మేరకు పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేశారు. అయితే దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన 8 మంది ఎమ్మెల్యేలు తాము పార్టీ మారలేదంటూ వివరణ ఇచ్చారు. ఫిర్యాదుదారులు వారు పార్టీ మారని వారికి వ్యతిరేకంగా ఆధారాలు సమర్పించారు.

## ఘనంగా మాజీ మంత్రి ఇంద్రారెడ్డి జయంతి వేడుకలు



**మొయినాబాద్ మహా:** విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు పెంచుకుని గ్రామ స్థాయి రాజకీయాల నుంచి రాష్ట్ర రాజకీయాల వరకు ఎదిగిన ఇంద్రారెడ్డి భౌతికంగా ప్రజల మధ్య లేకపోవడం ఈ ప్రాంతానికి తీరని లోటు అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కోంపల్లి అనంతరెడ్డి, సీనియర్ నాయకులు కొత్త నర్సింహ్మారెడ్డి అన్నారు.మాజీ హోంమంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి జయంతి వేడుకలను బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించి శనివారం మొయినాబాద్ మున్సిపాలిటి కేంద్రంలో ఉన్న ఇంద్రారెడ్డి విగ్రహానికి బీఆర్ఎస్ శ్రేణులు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంద్రారెడ్డి ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థి సంఘం నాయకునిగా ఎదిగి రాజకీయాల్లోనికి ప్రవేశించారని తెలిపారు. గ్రామ స్థాయి రాజకీయల నుంచి రాష్ట్ర రాజకీయాలలో అరంగేట్రం చేసి ఉమ్మడి రాష్ట్రంలో ఒక వెలుగు వెలిగిన నాయకుడని అన్నారు. చేవెళ్ల ప్రజలకు ఎన్నో సేవలు అందించాలరని ఆయన భౌతికంగా ప్రజల మధ్య లేకపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు రాజకీయంగా తీరని లోటు అని చెప్పారు.ఇంద్రారెడ్డి భౌతికంగా లేకపోయిన ఆయన వారసత్వ రాజకీయాలు కుటుంబ సభ్యులు కొనసాగిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. కార్యమక్రమంలో మాజీ సర్పంచ్లు సుధాకర్యాదవ్,కోట్ల నరోత్తంరెడ్డి, జి మహేందర్రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొత్త మాణిక్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎంఏ రావూఫ్, జి జయవంత్, జి వెంకట్రెడ్డి, బాల్రాజ్, సురేందర్ గౌడ్, సత్తిరెడ్డి, రాంచందర్, ఎండీ అలీమ్, నర్సింహ్మారెడ్డి, ఎండీ అమ్జాత్, తదితరులు పాల్గొన్నారు.

## రూ.3,600 కోట్ల భూములకు రక్షణకు రంగంలోకి హైడ్రా

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ లోని కొండాపూర్ లో రూ.3,600 ప్రభుత్వ భూముల స్వాధీనానికి హైడ్రా రంగంలోకి దిగింది. ఆర్టీఏ కార్యాలయం పక్కన భిక్షపతి నగర్‌లో ఉన్న సర్వే నంబర్ 59లోని 36ఎకరాల భూములలో అక్రమ నిర్మాణాలను హైడ్రా సిబ్బంది తొలగించారు. పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టిన హైడ్రా ..కూల్చివేతల ప్రాంతాంలోకి జనాన్ని అనుమతించలేద. రెండు కిలోమీటర్ల దూరంలోనే బారికేడ్లను ఏర్పాటు చేసిన హైడ్రా స్థానికులను అడ్డుకుంది. తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని ఖాళీ చేయించింది. ఈ భూములు 60ఏళ్లుగా తమ ఆధీనంలో ఉన్నాయని రైతులు వాదిస్తున్నారు. అయితే ఈ భూముల వివాదంలో హైకోర్టు తీర్పు మేరకు హైడ్రా ఆక్రమణల తొలగింపును చేపట్టింది. చుట్టూ కంచె వేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హుల జాబితా విడుదల చేసిన ఎన్నికల సంఘం

### రేషన్ డీలర్లు అర్హులు




**హైదరాబాద్, మహా :** స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఎవరు అనర్హులో ఎన్నికల సంఘం ప్రకటించింది. నామినేషన్ల పరిశీలన తేదీ సమయానికి 21 ఏళ్లు నిండిన వారు మాత్రమే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులని రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. అలానే ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థులకు వారి గ్రామం లేదంటే స్థానిక నియోజకవర్గంలో తప్పకుండా ఓటు హక్కు కలిగి ఉండాలని తెలిపింది. ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్లు, జడ్పీటీసీ, సభ్యులుగా పోటీ చేయడానికి కావాల్సిన అర్హతలపై మార్గదర్శకాలను విడుదల చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్వాడీ కార్యకర్తలతో పాటుగా గ్రామ సేవకులు, స్థానిక సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, స్థానిక సంస్థల ఎయిడెడ్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులని తెలిపింది. అలానే అసెంబ్లీ, పార్లమెంటు చట్టం ప్రకారం ఏర్పాటు చేసిన సంస్థలోని ప్రతినిధి పోటీ చేయడానికి అనర్హులని ఈసీ ప్రకటించింది. పూర్తి స్థాయి బదిరులు, మతిస్థిమితం లేనివారు కూడా పోటీకి అనర్హులు. మతసంబంధమైన సంస్థల సభ్యులు, ఛైర్మన్లు కూడా పోటీ చేయడానికి వీల్లేదని ప్రకటించింది. అలానే ఆర్టీసీ, సింగరేణిలో మేనేజింగ్ ఏజెంట్, సెక్రటరీ, మేనేజర్ హోదాలో పని చేస్తున్న వారు పోటీ చేయడానికి వీల్లేదు. వీరు కాక మిగిలిన ఉద్యోగులు పోటీ చేయడానికి అర్హులు. అలానే రేషన్ డీలర్లూ ఈ ఎన్నికల్లో పోటీ చేయవచ్చు. క్రిమినల్ కోర్టుల్లో ఏవైనా నేరాలకు శిక్ష పడిన వ్యక్తి అనర్హుడు. వారు శిక్ష విధించిన డేట్ నుంచి 5 సంవత్సరాల వరకు సదరు వ్యక్తి ఎన్నికల్లో పోటీ చేయకూడదు. జిల్లా పరిషత్, మండల, పంచాయతీలలో.. రాష్ట్ర, కేంద్రం ప్రభుత్వాల్లో ఏవైనా కాంట్రాక్టు, నిర్వహణకు ఒప్పందం చేసుకున్నా కాంట్రాక్టర్లు కూడా పోటీ చేయడానికి కూడా అనర్హులని ఎన్నికల సంఘం తెలిపింది.

**సర్పంచ్ స్థానానికి పోటీ చేయాలంటే అర్హతలు**

సర్పంచ్ స్థానానికి పోటీ చేయాలి అనుకునే వ్యక్తి కచ్చితంగా గ్రామపంచాయతీలో స్థానికుడై ఉండాలి. ఎవరైతే పోటీ చేయాలనుకుంటున్నారో వారి పేరు పంచాయతీ ఓటింగ్ లిస్టులో నమోదై ఉండాలి. సర్పంచ్ స్థానానికి నామినేషన్ దాఖలు చేసే సమయానికి పోటీ చేయాలి అనుకునే వ్యక్తి వయసు 21 సంవత్సరాలు నిండి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీ అభ్యర్థులు జనరల్ కేటగిరి నుంచి కూడా పోటీ చేయడానికి ఆస్కారం ఉంది. మహిళలకు రిజర్వు చేసిన స్థానాలతో పాటు అదే కేటగిరిలోని జనరల్ స్థానాల్లోనూ పోటీ చేయవచ్చు.

## ప్రశాంత్ కిషోర్ ఓ రాజకీయ దొంగ

- ఇప్పటికైనా మీరు ఆచితూచి మాట్లాడితే బాగుంటుంది
- ప్రశాంత్ కిశోర్‌కు టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి కౌంటర్



**హైదరాబాద్, మహా:** రేవంత్ రెడ్డిపై ఎన్నికల వ్యూహకర్త, జన్ సూరజ్ పార్టీ చీఫ్ ప్రశాంత్ కిషోర్ చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన సోషల్ మీడియాలో ఓ వీడియోను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రశాంత్ కిషోర్ ఓ రాజకీయ దొంగ అని ఆరోపించారు. అతడు ఓ ప్రీపెయిడ్ రీఛార్జ్ లాంటి వాడని.. ఎంత రీఛార్జ్ చేస్తే అంత టాక్‌టైమ్ వచ్చినట్లుగా మాట్లాడుతుంటాడని ఫైర్ అయ్యారు. రాజకీయ పార్టీలకు సలహాలు ఇచ్చే ప్రశాంత్ కిషోర్ బిహార్ ప్రజల ప్రయోజనాల కోసం ఎప్పుడైనా కనీసం 15 నిమిషాలైన మాట్లాడారా.. అని ప్రశ్నించారు. ఎలాంటి పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్ లేకుండా రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారని.. ప్రస్తుతం ప్రపంచమంతా ఆయననే చూసేలా పని చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రశాంత్ కిషోర్ ఆచితూచి మాట్లాడితే.. బాగుంటుందని సామ రామ్మోహన్ రెడ్డి హితవు పలికారు.

## పది రోజుల్లో టీజీఎస్ఆర్టీసీ బ్లాక్ బస్టర్

### దసరా పండగల సందర్భంగా రూ.110 కోట్ల ఆదాయం



**హైదరాబాద్, మహా:** బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా టీజీఎస్ఆర్టీసీకి రూ.110 కోట్ల మేర ఆదాయం సమకూరినట్లు యాజమాన్యం ప్రకటించింది. ఈ సారి 7,754 ప్రత్యేక బస్సులు నడపాలని తొలుత నిర్ణయించినప్పటికీ.. ఆశించిన మేర ప్రయాణికులు లేకపోవడంతో 5,300 వరకు మాత్రమే తిప్పినట్లు అధికారులు వెల్లడించారు. ప్రత్యేక బస్సుల్లో ఈసారి 50 శాతం వరకు అదనపు ఛార్జీలను వసూలు చేశారు. గత ఏడాది ఇదే సీజన్‌లో 6300 ప్రత్యేక బస్సులు నడపగా.. రూ.114 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఏడాదితో పోల్చితే.. ఈసారి సొంతూళ్లకు వెళ్లిన ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉందని, కొందరు ప్రైవేటు వాహనాలనూ ఆశ్రయించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. తిరుగు ప్రయాణానికి సంబంధించి ఈనెల 5, 6వ తేదీల్లో రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాలని సంస్థ నిర్ణయించింది.

WEEKEND ANALYSIS
వీకెండ్ అనాలసిస్

# రిజర్వేషన్ల రాజకీయం

తెలంగాణ రాజకీయాలు మళ్లీ వేడెక్కుతున్నాయి. ఓ వైపు జూబ్లీ హిల్స్ ఉపఎన్నిక... మరో వైపు రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల చర్చలు ఊపందుకున్నాయి. అక్టోబర్ 8న హైకోర్టులో ఏం జరుగుతుందనే ఉత్కంఠ నెలకొంది. రిజర్వేషన్ల రాజకీయం – నిజంగా ఎవరికి కలిసొస్తుంది? 69 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు సాధ్యమా? రాష్ట్రాల రిజర్వేషన్లకు రాజ్యాంగపరమైన శాస్త్రీయత ఉందా? అనే అంశాలపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఈ రిజర్వేషన్లతో ఎన్నికలు జరగడం అసాధ్యమన్న అభిప్రాయాలు ఎక్కువగా వినబడుతున్నాయి. ఓ వైపు గ్రౌండ్ లో స్థానిక రాజకీయం జరుగుతుంటే.. పార్టీల అధిష్టానాలు జూబ్లిహిల్స్ బైపోల్ పై ఫుల్ ఫోకస్ పెట్టాయి. జూబ్లిహిల్స్ బైపోల్ ఫలితం తెలంగాణ రాజకీయాల్లో కీలకం కానుంది. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు పాలన మళ్ళీ ఆర్థికస్థిరత్వం తీసుకొస్తుందన్న ఆశలు బలపడ్డాయి.

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సీఈవో, సీనియర్ జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి విశ్లేషణ**


కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

తెలంగాణలో రాజకీయాలు ఊపందుకుంటున్నాయి. ఒక వైపు జూబ్లీ హిల్స్ అసెంబ్లీ బైపోల్, మరో వైపు స్థానిక సంస్థల ఎన్నికలు. నియోజకవర్గంలో 3.99 లక్షల మంది ఓటర్లు జూబ్లి హిల్స్‌లో భవిష్యత్తును నిర్ణయించబోతున్నారు. బీఆర్ఎస్ మాగంటి సునీత గోపీనాథ్‌ను అధికారికంగా ప్రకటించినప్పటికీ, కాంగ్రెస్, బీజేపీ ఇంకా అభ్యర్థులను ఖరారు చేయలేదు. ఎంఐఎం అధినేత ఔవైసీ బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. అక్టోబర్ 8న తెలంగాణ హైకోర్టులో బీసీలకు 42% కోటా పెంపిన్‌పై విచారణ జరగనుంది. గ్రామ, వార్డు సభల్లో మొత్తం రిజర్వేషన్లు 67%కి చేరడంతో 50% మింహాయింపు ఉల్లంఘన ఆరోపణలు ఎదుగుతున్నాయి. కాంగ్రెస్ సర్కారు ఈ జీఓను రక్షించుకోవడానికి రాజకీయ పార్టీల అఫిడవిట్లు సేకరిస్తోంది. 69% రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించడం సాధ్యమే అని ప్రభుత్వం బలిస్తోంది, కానీ హైకోర్టు దీనిపై ప్రశ్నలు లేవనెత్తింది. మరోవైపు సుప్రీంకోర్టులో కూడా దీనిని సవాల్ చేస్తూ కేసు పడింది. అక్టోబర్ 6న విచారణ జరగనుంది.

పల్లె ఎన్నికలపై రిజర్వేషన్ల ఉత్కంఠ కొనసాగుతోంది. సుప్రీంకోర్టు, హైకోర్టులలో ఈ వారమే ఎన్నికలు జరుగుతాయో.. లేవో తేలిపోనున్నాయి. ఎన్నికలు జరిగినా, వాయిదాపడ్డా ఫాయిదా రాష్ట్ర సర్కారుకే అన్న చర్చ జరుగుతోంది. రిజర్వేషన్లు కేంద్రం పరిధిలోని అంశం. పార్లమెంట్ చట్టం ఆధారంగా రిజర్వేషన్లు ఏర్పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఇష్టానుసారం చేయాలనుకున్నా.. పార్లమెంట్ లో మారిస్తే తప్ప అది జరగని పని. ఇతర రాష్ట్రాల్లో అనేకమార్లు ఇలాంటి ప్రయత్నాలు జరిగి నిలిచాయి. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిసి రిజర్వేషన్లు, కులగణన అంశంలో ప్రదర్శించిన చిత్తశుద్ధిని అందరూ అభినందిస్తున్నారు. అన్నిరకాల ప్రయత్నాలు రాష్ట్ర ప్రభుత్వస్థాయిలో ముఖ్యమంత్రి చేశారు. హైకోర్టు ఆదేశాలు రావడంతో కాంగ్రెస్ బీసీల ఓటుబ్యాంకును బలోపేతం చేసుకోవచ్చు. బైపోల్‌లో విజయం సాధిస్తే రాజకీయ ఆధిపత్యం మరింత పటిష్ఠమవుతుంది. తెలంగాణలో బీసీ కమిషన్ సిఫార్సుల ఆధారంగా 42% పెంపు, కానీ జాతీయ మార్గదర్శకాలు 50% మించి అనుమతించవు.

ఏపీలో చంద్రబాబు దూకుడు మీదున్నారు. కూటమి పథకం కేంద్రం దన్నుతో ఆర్థికంగా కుదురుకునే ప్రయత్నాలు చేస్తోంది. ఏపీలో చంద్రబాబు పాలన ప్రజలను ఆకట్టుకుంటోంది. గత కొంతకాలంగా ఆర్థికస్థితిపై ఆందోళన నెలకొనగా, కేంద్రం నుండి రాబడుతున్న నిధులు,వస్తున్న పెట్టుబడులతో ఏపీ భవిష్యత్ పై ఆశలు పెంచారు. పవర్ టారిఫ్ హైక్స్ ఆపేశారు, ఆటో డ్రైవర్లకు రూ.15,000 సహాయం, సబ్సిడీలు క్లియర్ చేస్తున్నారు. 2047కల్లా జీఎస్‌పీ డాలర్ 2.4 ట్రిలియన్ లక్ష్యం వేశారు. విశాఖ, అమరావతిలో పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకువస్తున్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని సభలు జరపడంతో పాటు ప్రజల్లో పాజిటివ్ ధోరణి బలపరచడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి.

జూబ్లి హిల్స్ బైపోల్ తర్వాత రాజకీయాల్లో మార్పులు ఖాయంగా కనబడుతున్నాయి. అధికార కాంగ్రెస్ గెలిస్తే.. ఇక ఆ పార్టీ మరింత దూకుడుగా స్థానిక సమరానికి, జీహెచ్ ఎంసీ వార్ కు రెడీ అవుతుంది. కాంగ్రెస్ బలపడితే స్థానిక ఎన్నికల్లో ఆధిక్యం, బీఆర్ఎస్ విజయం అయితే ప్రతిపక్షంగా బలం. బీజేపీ అభ్యర్థి ఎవరో త్వరలో తేలనుంది. ఈ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో విభజనకు దారితీస్తాయి. రిజర్వేషన్ వివాదం కాంగ్రెస్‌కు ఓటర్ల మద్దతు తెచ్చిపెట్టవచ్చు, కానీ హైకోర్టు నిర్ణయం కీలకం. తెలంగాణలో ఈ రాజకీయ తుఫాను రాబోయే ఎన్నికల ఆకృతిని మార్చవచ్చు. ఒక దుబ్బాక.. హుజూరాబాద్.. మునుగోడు ఎన్నికల తరహాలో జూబ్లిహిల్స్ ఇపుడు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా ఉంది.



# వందేళ్ళలో ఆర్‌ఎస్‌ఎస్- వామపక్షాలు



భిన్న దృవాలు, భిన్న ఆలోచనలు కలిగిన రెండు సంస్థలు దాదాపుగా 100 సంవత్సరాల క్రిందట ప్రారంభమయ్యాయి. వాటిలో ఒకటి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), మరొకటి కమ్యూనిస్టు పార్టీ. ఈ రెండూ భిన్న అభిప్రాయాలు కలిగినవిగా, మరో మాటలో చెప్పాలంటే ఒక సంస్థ సిద్ధాంతంతో మరో సంస్థ విబేదిస్తుంది. ఈ సంస్థలు తమ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నాయి. ఆర్ఎస్ఎస్ కు అడుగడుగునా ఆటంకాలు ఎదురయ్యాయి. ఎన్నో సార్లు నిషేధాలు, ప్రభుత్వాలతో చీదరింపులు వంటి ఎదురు దెబ్బలు తగిలాయి. వామపక్షాల నుండి తీవ్రమైన మేధోపరమైన ఎదురుదాడినీ ఎదుర్కొంది. అయినప్పటికీ నిలబడి, స్థిరబడి వ్యాప్తి చెంది నేడు అగ్ర స్థానానికి చేరింది.

రెండోది అయిన కమ్యూనిస్టు పార్టీ పరిస్థితి నేడు చూస్తున్నాం. దేశంలో పేరెన్నికగన్న మేధావులు అందరూ ఆ పార్టీని మోసినా, విదేశాల నుంచి ఆర్థిక సహాయం అందినా, విదేశాల మేధావుల మద్దతు పొందినా కూడా నేడు దేశంలో దాదాపు కనుమరుగు అయ్యే స్థితికి చేరుకుంది. పైగా ఆవిర్భావం తర్వాత ఎన్నో సార్లు చీలిపోయింది. ఇప్పటికీ చీలిపోయిన పార్టీలు తమ సిద్ధాంతం కోసం పోరాటం చేస్తూనే ఉన్నాయి. ఒక సంస్థ బలపడి దేశంలోనే అగ్రస్థానంలో నిలబడితే మరో సంస్థ నీరసించి నిస్సవత్తుతో సాగుతూ ఉనికి కోసం పాకులాడటానికి గల కారణాలేమిటి అన్నది ప్రస్తుతం చర్చనీయాంశ అంశమైంది. ఆర్ఎస్ఎస్ స్థాపనే ఈ దేశాన్ని బలోపేతం చేయడం, దానితో విడదీయరాని ఈ హిందూ సంస్కృతిని బలోపేతం చేయడం, భవిష్యత్తు లో మళ్లీ దీనికి పునర్వైభవం తీసుకురావాలి అని గాఢమైన కోరిక. దాని కోసం చిత్తశుద్ధితో, పటాటోపం లేని కార్యాచరణ. అంతకు మించి పట్టుదలను కలిగి ఉండటం. ఈ దేశానికి సంబంధించిన ప్రతీ దానిని ప్రేమించడం, వాటిని చూసి గర్వించడం వంటి లక్షణాలు దాని కార్యకర్తలకు సంఘ్ అలవాటు చేసింది. అంతే కాకుండా దేశ సంస్కృతీ, సంప్రదాయాలపై అచంచలమైన విశ్వాసాన్ని కలిగించేందుకు ప్రయత్నించడం. ఈ దిశగా కార్యకర్తలకు నిరంతరం మార్గదర్శనం చేయడం. రెండో వైపు .... తాము నమ్మిన విదేశీ సిద్ధాంతమే గొప్పది అనే అబ్రాహామిక్ భావజాలంతో దానిని ఈ దేశ ప్రాచీన సంస్కృతిపై రుద్దడం కోసం, ఈ దేశ సంస్కృతిని బలహీనపరిచే ఉద్దేశంతో ఈ దేశానికి సంబంధించిన ప్రతీ దానిని వ్యతిరేకించడం వామపక్ష మేధావులు చేశారు. అదే వారి కార్యకర్తలకు నూరిపోశారు. ఈ దేశం ప్రత్యేకంగా ఎవరిదీ కాదు. దీనికి ప్రత్యేక అస్తిత్వం లేదు. ఇది ఒక సత్రం.

ఇక్కడ మెజారిటీ ప్రజలు వలస వచ్చారు. అలాగే ఎవరైనా వలస వచ్చి ఇక్కడ ఉండి ప్రజలను పాలించే హక్కు ఉంది. ఇక్కడ మత గ్రంధాలు, పురాణ పురుషులు అంతా కల్పితం. ఈ సంస్కృతి అంటూ ప్రత్యేకంగా ఏమీ లేదు. ఇక్కడ ఆచారాలు, పండుగలు అన్ని పచ్చి మూఢ నమ్మకాలు, ఎగతాళి చేయబడే అర్హత గలవి. ఇలా ఈ దేశ సంస్కృతికి చెందిన ప్రతీ విషయాన్ని వ్యతిరేకించడంతో మొదలు పెట్టి రాను రాను దానిని ద్వేషంగా మార్చుకున్నారు. తమని తాము పూర్తిగా ఈ సంస్కృతి నుండి దూరంగా జరిపేసుకుని వామపక్ష మేధావులనే ముద్ర వేయించుకున్నారు. ఈ సంస్కృతిలో పుట్టి పెరిగి తమ పూర్వీకుల సనాతన పరంపర తమ జీన్స్ లో ఉంది అనే సంగతి తెలిసినా, దానిని అణిచిపెట్టి స్వీకరించిన కొత్త విదేశీ భావజాలాన్ని నెత్తిని పెట్టుకుని, మేధావులు గా గుర్తింపు తెచ్చుకునేందుకు తమ పూర్వీకుల పరంపరనే తప్పని సరిగా ద్వేషించవలసిన పరిస్థితి కోరి తెచ్చుకున్నారు ఈ వామపక్ష వాదులు. దీని వల్ల మానసిక ఘర్షణ దానిని అధిగమించడానికి హిందూ సంస్కృతిపై మరింతగా ద్వేషం వెద జల్లడం ఎక్కువ అయింది.

ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని వ్యతిరేకిస్తున్నాం, ద్వేషిస్తున్నామని అనుకుంటూ అసలు తమ ఉనికి అయిన తమ సంస్కృతి నే ద్వేషించడం మొదలుపెట్టారు. హాయిగా ప్రశాంతంగా ఆనందంగా అనుభవించవలసిన ఇంట్లో శుభకార్యాలు, పండుగలు, వ్రతాలు, హోమాలు, చేస్తున్న తీర్థయాత్రలు అన్ని కూడా ఏదో అపరాధ భావంతో చేస్తున్నట్లుగా చేయవలసిన పరిస్థితి తెచ్చుకోవడం నిజంగా దురదృష్టకరం. దేశంలో జరుగుతున్న భారీ సాంస్కృతిక పండుగలు, భారీ ఉత్సవాలు, మేళాలు, వంటి వాటిలో కూడా లోపాలు వెతకడం మరియూ అపహాస్యం చేయడం అలవాటు చేసుకున్నారు. ఈ పరిస్థితి కి కారణం ఏమిటి అని వారు ఇప్పటికి అయినా ఆత్మ విమర్శ చేసుకుని తమదైన ఈ భారతీయ సంస్కృతిని గౌరవించి దాని ఉన్నతికి పాటు పడదాం అనే ఆలోచన వారిలో రావాల్సిన అవసరం ఉంది. ఒకప్పుడు వామపక్ష భావాలు ఆదర్శంగా ఉన్నాయనుకున్న వారిలో కొంత మంది ప్రస్తుతం ఆ భావన నుంచి బయటపడుతున్నారు. చాలా రాష్ట్రాలు కమ్యూనిస్టుల పాలనకు దూరమయ్యాయి. నిన్నటి వరకు తుపాకి గొట్టం ద్వారానే పేదరికం దూరం చేయవచ్చని అహర్నిషలు పోరాటం చేసిన వారు చాలా మంది వాస్తవాలను తెలుసుకుని జనజీవన స్రవంతిలో కలుస్తున్నారు.


**- గడ్డం కృష్ణమూర్తి**
సీనియర్ జర్నలిస్ట్, అసోసియేట్ ఎడిటర్

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

ANN తెలుగు
మహా పత్రిక


## ప్రచారంలో జోరు పెంచిన బీజేపీ జిల్లా నాయకులు



**వరంగల్ మహా:** జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ లో భాగంగా భారతీయ జనతా పార్టీ అభ్యర్థి విజయానికి అనుకూలంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని ఎర్రగట్టు డివిజన్ ప్రాంతంలో నిర్వహించిన ప్రచారంలో వరంగల్ జిల్లా నుండి బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు తో కలిసి మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రగడ్డ ప్రాంతంలో పర్యటించి ఇంటింటికి తిరిగి ప్రజలను కలుసుకున్నారు. ప్రతి ఓటర్ తో మాట్లాడిన కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ కుటుంబ పార్టీలకు, దొరల రాజకీయాలకు ఇది ముగింపు సమయం. సామాన్య ప్రజల సంక్షేమం కోసం పనిచేసే పార్టీ ఒక్కటే భారతీయ జనతా పార్టీ. కాంగ్రెస్, బిఆర్ఎస్ వంటి పార్టీలు కొద్దిమంది కుటుంబ బాలుకు చెందినవైనా, బిజెపి మాత్రం 140 కోట్ల భారతీయుల పార్టీ. ప్రతి ఓటరును అభ్యర్థిస్తున్నాను మన దేశ అభివృద్ధికి, మన కుటుంబ భవిష్యత్తుకి బిజెపి అభ్యర్థికి ఓటు వేయండి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు గరికపాటి మోహన్ రావు, మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్, జూబ్లీహిల్స్ నియోజకవర్గం బిజెపి కంటెస్టెంట్ ఎమ్మెల్యే శ్రీ దీపక్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి షాక్ ఇచ్చిన కాంగ్రెస్ శ్రేణులు

### ఎర్రబెల్లి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ లో చేరికలు



**జనగామ మహా:** జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు వడ్లకొండ తార, కాంగ్రెస్ జిల్లా యువజన నాయకులు ఇప్ప పృథ్వి రెడ్డి, నీర్మాల కాంటెస్టెడ్ సర్పంచ్ వడ్లకొండ ప్రశాంత్, నీర్మాల గ్రామ అధ్యక్షుడు చింత రవీందర్ రెడ్డి కాంగ్రెస్ క్రియాశీలక నేతలు తీర్పెల్లి కొండల్ రెడ్డి, ఎడ్ల శ్రీను సహా మరికొంతమంది కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరటం జరిగింది. అలాగే పెద్దవంగర మండలంలోని కన్నాయిగూడెం నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఝాన్సీరెడ్డి, యశస్వినీ రెడ్డి వైఖరి పట్ల తీవ్ర ఆవేదనతో పని చేసిన నాయకులు కార్యకర్తలకు గుర్తింపు లేదని వారు ఆవేదనతోనే తాము పార్టీ వీడుతున్నామని వారు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ బాకీ కార్డులు పంపిణీ చేయడం జరిగింది. తదనంతరం ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ ప్రతీ ఒక్క కార్యకర్త ఇంటి ఇంటికి తిరిగి మోసపూరిత కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారాలతో అధికారం లోకి వచ్చి 22 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవటంతో నేడు ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల పై బాకీ కార్డులు పంపిణీ చేసామని రానున్న ఎలక్షన్లో ఓటు అడగడానికి వచ్చిన కాంగ్రెస్ నాయకులకు ఈ కార్డు చూపించి హామీలు ఏమయ్యాయని నిలదీయాల్సిందిగా ప్రజలకు పిలుపునిచ్చారు.

## కుటుంబాన్ని కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది

### క్రైమ్ ఏసీపీ సదయ్య




**వరంగల్ మహా;** కుటుంబ వ్యవస్థను పరిరక్షించాల్సిన బాధ్యత మహిళా పోలీసులు అలాగే అధికారుల పై ఉందని క్రైం ఏసీపీ మహిళా పోలీస్ స్టేషన్ 1 ఇన్స్పెక్టర్ కు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా క్రైం ఏసీపీ శనివారం రంగం పేట లోని వరంగల్ మహిళా పోలీస్ స్టేషన్ 1 సందర్శించారు. తనిఖీల్లో స్టేషన్ సంబంధించిన రికార్డులను పరిశీలించడంతో పాటు కేసులకు సంబంధించిన సిడి ఫైల్స్ లను పరిశీలించి పెండింగ్ కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో కేసులు, నిందితుల అరెస్ట్ కు సంబంధించిన వివరాలను స్టేషన్ ఇన్స్పెక్టర్ సూర్యప్రసాద్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శాఖపరమైన సమస్యల పై స్టేషన్ సిబ్బంది ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ భార్య భర్తల మధ్య జరిగే గొడవల పై స్టేషన్ కు వచ్చే బాధితులకు సరైన కౌన్సిలింగ్ నిర్వహించి భార్య భర్త మధ్య సఖ్యతను కుదర్చడమే లక్ష్యంగా పనిచేయాలని, అలాగే మహిళా బాధితులకు సరైన రీతిలో న్యాయం కూడా అందించాలని ఏసీపీ తెలియజేశారు

## నరకాసుర వధ ఉత్సవ ఏర్పాట్లకు వినతి

### ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరుపల్ల రవి



**వరంగల్ మహా;** ఈనెల 19వ తారీఖున దీపావళి పండుగ సందర్భంగా జరుగు నరకాసుర వధ ఉత్సవాలకు మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేయిస్తామని వరంగల్ మహానగర పాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తెలిపారు. శనివారం నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరుపల్ల రవి ఆధ్వర్యంలో మేయర్ గుండు సుధారాణి కమిషనర్ చాహత్ బాజ్పాయ్ లకు పుష్పగుచ్చాలు అందించి వినతిపత్రం అందజేశారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించాలన్న సత్సంకల్పంతో గత 23 సంవత్సరాల నుండి వరంగల్ కూడా ప్రాంగణంలో 58 అడుగుల భారీ నరకాసుర విగ్రహాన్ని దహనం చేసే కార్యక్రమాన్ని ఎన్నో వ్యయ ప్రయాసలు కోర్చి నిర్వహిస్తున్నామని ఈ ఉత్సవాలకు విచ్చేయు భక్తులకు ఇబ్బందులు కలగకుండా పెద్ద ఎత్తున విద్యుత్ దీపాలంకరణ ఆధునిక సౌండ్ సిస్టం ఏర్పాటుతో పాటు ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధ్యక్షులు మరుపల్ల రవి వారికి విన్నవించారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి కమిషనర్ చాహత్ వాజ్పాయ్ మాట్లాడుతూ నరకాసురవద ఉత్సవం అత్యంత వైభవంగా జరపడానికి తాము చొరవ చూపుతా మన్నారు. శనివారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కూడా వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీం మసూద్ నరకాసుర వద ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవి కోశాధికారి మరుపల్ల గౌతమ్ ఉపాధ్యక్షులు ఆవునూరి రామ్మూర్తి దూడే బాల కొమురెల్లి సహాయ కార్యదర్శులు వనం కుమార్ అవునూరి రామన్న శెట్టి మోహన్ ఉప కోశాధికారి కోరె సాంబమూర్తి కార్యనిర్వహక కార్యదర్శి తవటం నరసింహ ఆర్గనైజర్లు మాటేటిశ్యామ్ కుండె రాజు ఆవు నూరి ఐలేశం, కొమ్ము రాజు కాటం సతీష్ లు ఉన్నారు.

## బెల్టు షాపులు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు

### ఇన్స్పెక్టర్ సంతోష్



**హన్మకొండ మహా;** ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధి లోని పాండవుల రఘు, తండ్రి పేరు మొగలి వయస్సు 40 సంవత్సరాలు, అనే నిందితుడు శనివారం ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న సుమిత కిరణా షాపు లో చట్టవిరుద్ధంగా బెల్టు షాపు నడుపుతున్నందుకు అరెస్టు ఆత్మకూరు పోలీసులు చేశారు. ఈ దాడిలో పోలీసులు అతని వద్ద నుండి రూ. 9,400/ విలువైన 10 MC డోవెల్స్, ఇంపీరియల్ బ్లూ, ఆఫీసర్ చాయిస్, రాయల్ స్టాగ్, రాయల్ గ్రీన్ ఫుల్ లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత నిబంధనల ప్రకారం 34(ఎ) టిఎస్ ఎక్సైజ్ చట్టం కింద కేసు నమోదు చేయడం జరిగిందని తదుపరి దర్యాప్తు కోసం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా చట్టవిరుద్ధమైన మద్యం కార్యకలాపాలను అరికట్టడానికి అలాగే శాంతిభద్రతల పరిరక్షణకు కఠినమైన చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ సంతోష్ హెచ్చరించారు.

## బల్దియా ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ

### మేయర్ ను కలిసిన ఎస్ఈ



**వరంగల్ మహా;** బల్దియా ఎస్ఈ గా నూతనం గా పదవి బాధ్యతలు చేపట్టిన సి హెచ్ సత్యనారాయణ శనివారం నగర మేయర్ గుండు సుధారాణి శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఛాంబర్ లో మర్యాపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ ఎస్ ఈ కి శుభాకాంక్షలు తెలిపారు.

# ఎన్నికల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ

### వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లాలో ప్రశాంతంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పటిష్ట కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పై జిల్లా కలెక్టర్ శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిసిపి అంకిత్ కుమార్, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి లతో కలసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, శాంతిభద్రతలు (లా అండ్ ఆర్డర్), సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, చెక్‌పోస్టుల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాల ఏర్పాటు, రూట్ మ్యాప్ల తయారీ, రాజకీయ పార్టీల ప్రచారానికి అనుమతుల మంజూరు వంటి కీలక అంశాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో రెండు విడతలలో స్థానిక సంస్థలను, రెండు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని, మొదటి విడతలో 5 మండలాలు, రెండవ విడతలో 6 మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికల జరుగుతాయని అన్నారు. అలాగే, ఆర్ ఓ లు ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు టాయిలెట్స్, ఫర్నిచర్, ర్యాంప్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రహరీ గోడలు లేని పోలింగ్ కేంద్రాలకు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. అధికారులు సమన్వయంతో రూట్ మ్యాప్లు రూపొందించాలని, రాజకీయ పార్టీల ప్రచారాలకు అవసరమైన అనుమతుల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామని, ఎన్నికల సిబ్బందితో పాటు అదనంగా సిబ్బందిని నియమించి, ఎన్నికల విధుల నిర్వహణ పట్ల శిక్షణ కల్పించాలని అన్నారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో డబ్బు పంపిణీ, మద్యం పంపిణీ, బెదిరింపులు, అక్రమ ప్రచారాలు వంటి ఉల్లంఘనలపై నిరంతరం నిఘా పెట్టి, తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయించాలని అన్నారు. మండల కేంద్రాలలో నామినేషన్ స్వీకరణ కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. నామినేషన్ల స్క్రూటినీ , ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ప్రక్రియ పై సిబ్బందికి శిక్షణ అందించాలని అన్నారు. పోలింగ్ రోజు పాటించాల్సిన నిబంధనల, విధులపై అధికారులకు ముందుగానే సమగ్ర అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పోటీలో ఉండే అభ్యర్థులు ఫైనల్ అయిన తర్వాత పొరపాట్లు జరగకుండా బ్యాలెట్ పేపర్ల ముద్రణ జరగాలని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని అన్నారు. రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం ఏదైనా సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి ఓటరుకు భద్రతతో కూడిన వాతావరణంలో ఓటు వేసే అవకాశం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సిఈఓ రామి రెడ్డి, డిపిఓ కల్పన, ఆర్డీఓ లు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, జిల్లా నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఎంపిడిఓ లు, పోలీసు అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జంక్షన్ల నిర్వహణ పక్కాగా జరగాలి

### జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో ఉన్న జంక్షన్ల నిర్వహణ పక్కాగా జరగాలని జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శనివారం జిడబ్ల్యూ ఎంసీ పరిధిలోని అలంకార్, జవహర్ కాలనీ, వడ్డేపల్లి, ఫాతిమనగర్ జంక్షన్ల వద్ద పూర్తయిన అభివృద్ధి పనులు, నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ జనగణ సమాగమ కేంద్రాలైన కూడలిలను అందంగా తీర్చి దిద్దిన తర్వాత వాటి నిర్వహణ పై నిర్లక్ష్యం చూపకూడదని, ప్రతిరోజూ పరిశీలించి శుభ్రత, విద్యుద్దీపాల నిర్వహణ, మొక్కల సంరక్షణ వంటి అంశాలపై నిత్యం పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కూడలిల సుందరీకరణ ప్రాంతాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా ఉండేలా చూసుకోవడం అవసరమన్నారు. ప్రజలు నిత్యం చూస్తూ ఉండే కూడలిలను పట్టణం ప్రతిబింబంగా భావించి వాటి నిర్వహణలో అత్యంత శ్రద్ధ తీసుకోవాలని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిడబ్ల్యూ ఎంసీ ఈఈలు రవి కుమార్, సంతోష్ బాబు ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణే లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ అడుగులు

### ట్రైసిటీలో పెద్ద ఎత్తున పథ సంచలన్.. బీజేపీకి ప్లస్ అయ్యేలా పక్కా ప్రణాళికలు

**వరంగల్ మహా;** తెలంగాణ రాష్ట్రంలో పూర్తి స్థాయిలో విస్తరించడమే లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ అడుగులు వేస్తోంది. జిల్లాల నుంచి మండల స్థాయి వరకు అలాగే ప్రతి గ్రామంలోనూ శాఖ ఉండేలా పక్కా ప్లాన్ చేస్తోంది. సంఘ్ ఏర్పడి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాల పేరిట గ్రేటర్ వరంగల్ లో బస్తీ ఉత్సవ్ తో పాటు పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సంవత్సరం దసరా నుంచి 2026 దసరా మధ్యలో నిర్వహించనున్న శతాబ్ది ఉత్సవాలు అబ్బురపరిచేలా భారీ ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా అక్టోబర్ 5 ఆదివారం ఉదయం వరంగల్ మహానగరంలోని కాజీపేట, భవాని నగర్, విశ్వవిద్యాలయ నగర్, హసన్ పర్తి నగర్, హనుమకొండ నగర్, కాశీబుగ్గ పద్మనగర్, ఖిలావరంగల్, వరంగల్ నగరాల్లో రూట్ మార్చ్ (పథసంచలన్) నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో వేలాదిమంది స్వయం సేవకులు యూనిఫాం తో పాల్గొననున్నారు. 2019 లో హైదరాబాద్ లో ఆర్ఎస్ఎస్ నిర్వహించిన పథసంచలన్ స్వయం సేవకులకు ఉత్సాహాన్ని ఇచ్చి వైబ్ క్రియేట్ చేసిందని చెప్పుకోవచ్చు. అదే తరహాలో వరంగల్ లో పథసంచలన్ నిర్వహించేందుకు పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. స్వయం సేవకులు ప్రధాన రోడ్లపై పెద్ద ఎత్తున మార్చ్ ఫాస్ట్ నిర్వహించడాన్ని చూసి మరింత మంది ఇందులో చేరే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. అయితే ఇది రాజకీయ పరంగానూ బీజేపీకి దోహదపడేలా ప్రణాళికలు రచిస్తున్నారని తెలుస్తోంది.

## స్థానిక సంస్థల ఎన్నికలలో లౌకిక ప్రజాస్వామ్య శక్తులతో కలిసి పనిచేస్తాం

### సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య




**రాజేంద్రనగర్, మహా ;** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కలిసివచ్చే లౌకిక ప్రజాస్వామ్య పార్టీలతో కలిసి పనిచేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య తెలిపారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో శనివారం విస్తా హోటల్ లో సిపిఐ రాష్ట్ర సభ్యులు యాదయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ రాబోయే జెడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచి ఎన్నికలలో కలిసివచ్చే ప్రజాస్వామ్య లౌకిక పార్టీలతో కలిసి కూటమిగా ఏర్పడి పోటీ చేసి మతతత్వ శక్తులను ఓడించాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామాలలో సిపిఐ కార్యకర్తలు ప్రజా సమస్యల మీద పోరాడుతూనే ప్రజలకు చేరువ కావాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. రాబోయే స్థానిక ఎన్నికలలో మత తత్వ రాజకీయ పార్టీలను చిత్తుచిత్తుగా ఓడించే ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు పుస్తకాల నర్సింగ్ రావు, పానుగంటి పర్వతాలు, కే రామస్వామి, ఓరుగంటి యాదయ్య, బుద్ధుల జంగయ్య, టి రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు ఎం శ్రీను, వడ్ల సత్యనారాయణ, ఎం ఏ రియాజ్, ఆర్ యాదగిరి, నీలమ్మ, పి శివకుమార్, భారతరాజు, నరసింహ, నరసింహ రెడ్డి, మల్లేష్, నర్రగిరి, సత్తిరెడ్డి ,సుధీర్, శ్రీనివాస్, నరసింహ, రాజు, సురేష్, బాలయ్య, కాటంరాజు, చందు యాదవ్, దత్తు నాయక్, మక్బుల్, మంజుల, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్, గణేష్ లను అభినందించిన ఎమ్మెల్యే నాగరాజు



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 43వ డివిజన్ పరిధిలోని మామునూరు గ్రామానికి చెందిన గాలి విజయలక్ష్మి రవికుమార్ దంపతుల కుమారుడు గాలి రాహుల్ గ్రూప్ 1 లో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్‌గా ఉద్యోగం పొందిన సందర్భంగా శనివారం వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ను మర్యాదపూర్వకంగా కలువగా ఎమ్మెల్యే నాగరాజు గాలి రాహుల్ కు స్వీట్ తినిపించి శాలువాతో సత్కరించి, మరింత ఉన్నతమైన స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా వరంగల్ 14వ డివిజన్ పరిధిలోని ఎనుమాముల గ్రామానికి చెందిన అరుముల్లా గణేష్ ఎంబిబిఎస్ సీటు సాధించిన సందర్భంగా హన్మకొండ సుబేదారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవగా, గణేష్ ను ఎమ్మెల్యే నాగరాజు శాలువాతో సత్కరించి అభినందించారు. గణేష్ ఎంబిబిఎస్ విద్య కొనసాగించేందుకు దాతలు సహకరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా వైద్య విద్యకు అవసరమైన పరికరాలను అందజేస్తూ తన వంతు సహాయక సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు.

## ప్రజల గుండెల్లో ఇంద్రారెడ్డి చెరగని ముద్ర వేశారు

### ఇంద్రారెడ్డి సేవలు మరువలేనిది



**రాజేంద్రనగర్, మహా ;** ప్రజా సమస్యలపై, అలుపెరుగని పోరాటం చేసి, అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో, చెరగని ముద్ర వేసుకున్న ప్రజా నాయకుడు, స్వర్గీయ మాజీ మంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి అని రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి అన్నారు. ఇంద్రారెడ్డి 71 వ జయంతి సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని డైరీ ఫార్మ్ చౌరస్తాలో శనివారం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కోలన్ సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ పి అర్చన జయప్రకాష్ తో కలిసి కార్తీక్ రెడ్డి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరాలు మారినా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన ఘనత ఇంద్రారెడ్డికే దక్కుతుందన్నారు. పేదలకు అండగా నిలిచిన ఇంద్రారెడ్డి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. ప్రజల కోసం తమ ఇంటి తలుపులు తెరిచే ఉంటాయన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ఇంద్రారెడ్డి ఆశయాలను కొనసాగి స్తామని స్పష్టం చేశారు. తుదిశ్వాస వరకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పరితపించిన స్వర్గీయ ఇంద్రారెడ్డి ప్రజల మన సుల్లో ఎప్పటికీ అమరులే అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పోరెడ్డి ధర్మా రెడ్డి, ఎస్ వెంకటేష్, ముక్రం ఖాన్, జహీరుద్దీన్, జాలిగం చిత్తారి, రాము యాదవ్, అప్పారెడ్డి ముకేశ్, కొత్త రాజశేఖర్ రెడ్డి, రమేష్ చారి, జీవన్ దాస్, బద్దం శ్రీకాంత్ రెడ్డి, సూర్యం, దుర్గేష్, రఘు యాదవ్, రాజేష్ యాదవ్, పుప్పాల లక్ష్మణ్, శ్రీవర్ధన్ రెడ్డి, పచ్చ శ్రీనివాస్, నయీమ్, కొంపల్లి జగదీష్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్య మనిషి జీవితానికి బంగారు బాట

### టీపీసీసి సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్



**ఆమనగల్లు, మహా:** విద్య మనిషి జీవితానికి బంగారు బాట పిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం కడ్తాల్ మండలం మైసిగండి గ్రామానికి చెందిన డాక్టర్ కె.హెచ్. మురళీ నాయక్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రానిక్స్‌లో పి.హెచ్.డి.ని విజయవంతంగా పూర్తి చేశారు. ఈసందర్భంగా గిరిజన విద్యార్థి మురళి నాయక్ అభినందించి సన్మానించారు.అనంతరం టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ నిరాడంబరమైన వ్యవసాయ కుటుంబంలో మూలాలు కలిగిన డాక్టర్ కె.హెచ్. మురళీ ఎల్లప్పుడూ విద్య పట్ల మక్కువ కలిగి ఉంటారని, అంకితభావం, పట్టుదల ఆయనను ఈ అద్భుతమైన విజయానికి నడిపించాయన్నారు. ప్రస్తుతం, తెలంగాణలోని ప్రముఖ కళాశాలలలో ఒకటిగా గుర్తింపు పొందిన షహాబాద్‌లోని వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారని విద్యా నైపుణ్యం పట్ల తన నిబద్ధత పరిశోధనలకు ఆయన చేసిన కృషి ఆయన విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. విద్య లేనిదే విలువ లేదని ఏది సాదించాలన్న విద్య కచ్చితంగా కావాలని ఉన్నత శిఖరాలకు చేరాలంటే విద్య కావాలని భావి భారత పౌరులు ఎదగడానికి, ఉద్యోగ, వ్యాపార, రాజకీయా, సామాజిక సేవ ఇలా అన్ని రంగాల్లో విజయం సాదించాలంటే విద్య ప్రముఖ్యత ఎంతో ఉందన్నారు. మైసిగండి గ్రామం నుండి మొదటి పి ఎచ్ డి సాధించిన వ్యక్తి మురళి నాయక్ అని గ్రామానికి గర్వ కారణం అని మురళి నాయక్ అందరూ ఆదర్శంగా తీసుకొని ఉన్నత విద్య లో ప్రగతి సాధించాలని శ్రీనివాస్ గౌడ్ కొనియాడారు. ఈ కార్యక్రమం లో భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దుద్యా నాయక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జవహర్ లాల్ నాయక్, హీరాసింగ్ నాయక్, అమృ నాయక్, పాండు నాయక్, తుల్సి రాం నాయక్, తారాసింగ్ నాయక్, రాము నాయక్, శేఖర్, శివ శంకర్ గౌడ్, అశోక్ నాయక్, గుండు పాల్గొన్నారు

## డబ్బు కోసం తల్లిని కడతేర్చిన కన్న కొడుకు

### మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం



**రంగారెడ్డి జిల్లా మహా:** డబ్బు కోసం నవమాసాలు మోసిన కన్న తల్లిని జీవితాంతం చూసుకోవాల్సిన ఓ కసాయి కొడుకు, కన్న తల్లినే కడతేర్చాడు. రంగారెడ్డి జిల్లా, మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా, మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామానికి చెందిన, మానిపాటి ఐలమ్మ సోమయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉండగా, వీరి ముగ్గురికి పెళ్లిలు అయ్యాయి. తల్లి ఐలమ్మ, తమ వృత్తి గంపల అల్లికలు పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆమె పెద్ద కుమారుడు శ్రీకాంత్ (34) కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే గత కొంతకాలంగా మధ్యానికి బానిసైన శ్రీకాంత్ డబ్బు కోసం తల్లితో తరచూ గొడవ పడేవాడని, డబ్బులు ఇవ్వక పోవడం తో కిరాతకుడిగా మరిన కొడుకు, తల్లిని ఇనుప రాడ్డుతో దాడి చేశాడు. దీంతో రక్తపు మడుగులో పడిఉన్న ఐలమ్మను గమనించిన స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. కాగా పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు.

## డివిజన్ సమస్యలు పరిష్కరించండి

### బల్దియా కమీషనర్ కు వినతి పత్రం అందజేత



**వరంగల్ మహా;** వరంగల్ నగరం 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమార్ ఆధ్వర్యంలో దామెర రాజ్ కమల్ 23 వ డివిజన్ అధ్యక్షుల తో కలిసి చిప్ప వెంకటేశ్వర్లు నేత గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమీషనర్ చాహత్ బాజ్ పాయి ని మర్యాద పూర్వకంగా కలిసి డివిజన్ల సమస్యల పై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్ లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం దగ్గర హైమాస్ లైట్, హర్ష కిరణం వీధి , పక్కీర్ వాడ నుండి మార్కండేయ గుడి వరకు ఇరువైపులా రోడ్లు, బండల గల్లి లో డ్రైనేజ్ తో పాటు సీసీ రోడ్డు నిర్మాణం, ఆటోనగర్ ఇందిరమ్మ చిన్న విగ్రహం నుండి మార్కండేయ గుడి ఆర్చి వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాట్లకు మంత్రి కొండా సురేఖ సూచించినప్పటికి పనులు ఆలస్యం అవుతున్న దృష్ట్యా కమీషనర్ ను కలిసి త్వరితగతిన పనుల కు టెండర్ ప్రక్రియ చేపట్టి పనులను ప్రారంభించాలని వినతి పత్రంలో కోరడం జరిగింది. ఇందుకు కమీషనర్ సానుకూలంగా స్పందించి వెంటనే ఈ ఈ కి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా చిప్ప వెంకటేశ్వర్లు కమీషనర్ కు కార్పొరేటర్ బస్వరాజ్ కుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## బొగ్గు అధికోత్పత్తి చేసిన కార్మికులకు ప్రోత్సాహం

**మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ**



**మందమర్రి, మహా :** బొగ్గు అదికొత్పత్తికి కృషి చేసిన కార్మికులకు సింగరేణి సంస్థ ప్రోత్సహిస్తుందని మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ అన్నారు. శనివారం స్థానిక కే.కే.ఓ.సి. ప్రాజెక్టులో ఉత్పత్తి, మెయింటెనెన్స్ విభాగాలలో విశేష ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా జీ.ఎం మాట్లాడుతూ ఓబీ, బొగ్గును డిపార్టుమెంటల్ యంత్రాల ద్వారా ఉద్యోగులు ఉత్పత్తి చేయడం అభినందనీయమని కొనియాడారు. ఉత్పత్తి పెంపుతోపాటు రక్షణ, భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం ఉద్యోగులకు ఆయన ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం మల్లయ్య, మేనేజర్ కె. రామరాజు, ప్రాజెక్ట్ ఇంజనీర్ వెంకట వంశీధర్, సీఎంఓ ఏఐ అధ్యక్షులు రమేష్, ఏఐటియుసి పిట్ కార్యదర్శి ఎం కుమారస్వామి, అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకై పూర్తి స్థాయిలో ఏర్పాట్లు

**మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి & కలెక్టర్ కుమార్ దీపక్**



**బెల్లంపల్లి, మహా:** మంచిర్యాల జిల్లాలో పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకై పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసినట్లు మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు.శనివారం బెల్లంపల్లి పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల/కళాశాల (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ) లో,బజార్ ఏరియాలో ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను మంచిర్యాల డి.సి.పి. ఎ.భాస్కర్ లతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లాఎన్నికల అధికారి & కలెక్టర్ మాట్లాడుతూ పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి తూ.చా. తప్పకుండా అమలు చేయాలని, ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేలా ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.2వ సాధారణ పంచాయతీఎన్నికల నిర్వహణ కొరకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లుచేయడం జరుగుతుందని, సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 16 జెడ్ పి టి సి, 129 ఎం పి టి సి స్థానాలకు 2 విడత లలో,306 సర్పంచ్, 2 వేల 680వార్డు సభ్యుల స్థానాలకు 3 విడత లలో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కొరకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, మండల స్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమ లు కొరకు మండల తహసిల్దార్లను నోడల్ అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. నామినేషన్ ప్రక్రియ మొదలైనప్పటి నుండి ఓట్లు లెక్కింపు ప్రక్రియ పూర్తై ఫలితాలు వెలువడే వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని, ప్రతి ఒక్కరూ నియమావళికి లోబడి ఉండాలని తెలిపారు.ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినట్లయితే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో దుర్గామాత శోభాయాత్ర



**జైపూర్ / మంచిర్యాల, మహా :** జైపూర్ మండల కేంద్రంలో భక్తిశ్రద్ధలతో భక్తులు దుర్గామాత నిమజ్జన శోభాయాత్రను శనివారం ఘనంగా నిర్వహించారు. గత పది రోజులుగా భక్తులు వివిధ రూపాల్లో దుర్గామాతను అలంకరించి ప్రత్యేక పూజలు, హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఎస్టీ కాలనీ నుంచి ప్రారంభమైన ఊరేగింపు, మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా సాగి దుర్గామాత నామస్మరణలతో మారుమ్రోగింది. మహిళలు మంగళ హారతులు, కోలాటాలు ఆడి పండుగ వాతావరణాన్ని అలరించారు. యువకులు డీజే సౌండ్‌తో జై జై దుర్గామాత నినాదాలతో ఊరేగింపును ఉత్సాహభరితంగా మలిచారు. పట్టణంలోని ప్రతి వీధి పూలతో, దీపాలతో అలంకరించబడింది. భక్తులందరూ అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు అమ్మవారి చరిత్ర, శక్తి వైభవాన్ని స్మరించారు. స్థానిక నాయకులు, ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తుల ఉత్సాహం, మహిళల భక్తి శ్రద్ధలు కలగలసి జైపూర్ పట్టణం మొత్తం దసరా శోభతో మెరిసిపోయింది. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


## పంచాయతీ ఎన్నికల సహాయక కేంద్రం ఏర్పాటు

**మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో సహాయక కేంద్రం ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలో మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్ 2025 ఎన్నికల దృష్ట్యా నామినేషన్లు, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్, పోస్టల్ బ్యాలెట్ ఇతర ఎన్నికల సంబంధించి సమాచారం, ఫిర్యాదులు, ఇతర దరఖాస్తుల కొరకు హెల్ప్ లైన్ నం.08736 250501 ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సహాయక కేంద్రం సేవలు 24×7 గంటలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రవర్తన నియమావళి అమలులో ఉందని, నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి సహాయక కేంద్రం నంబర్ లో సమాచారం అందించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

## కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో సన్నాహక సమావేశం



**ఆదిలాబాద్ మహా :** స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక జడ్పీటీసీ, యంపీటీసీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుదని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ధీమా వ్యక్తం చేసారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలోని సమావేశమందిరంలో మండలాల ముఖ్యనాయకులు కార్యకర్తలతో విడివిడిగా సమావేశమయ్యారు. బేల , భోరజ్, జైనథ్ మండల నాయకుల తో భేటీలో పలు అంశాలపై చర్చించారు. పోటీకి సిద్దంగా ఉండే ఆశావహులు వారికి ఆయా ప్రాంతాలలో ఉన్న బలాబలాలపై సమీక్ష జరిపారు. జడ్పీటీసీ, యంపీటీసీ లలో ప్రతీ స్థానం నుండి కొందరి ఆశావహుల పేర్లు పరిశీలనలోకి తీసుకుని అధిష్టానం సూచనలతో తుది జాబితా ఖరారు చేస్తామన్నారు. గెలిచే సత్తా ఉన్న అభ్యర్థులకు తప్పకుండా తదిజాబితాలో చోటు దక్కుందన్నారు. ఎవరికి టికెట్ లభించినా అంతా కలిసి స్థానిక ఎన్నికల్లో గెలుపేలక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. ఆ కార్యక్రమంలో ఆదిలాబాద్ నియోజకవర్గంలోని బేల, జైనథ్, భోరజ్ మండలాలలకు చెందిన ముఖ్యనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఐ ఫోన్ మొబైల్ అప్పగింత

**హన్మకొండ ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్**

**హన్మకొండ మహా;** హనుమకొండ గుడిబండల్ కు చెందిన హరికిషన్ 2025 జూన్ నెలలో ములుగు క్రాస్ రోడ్ లో తన లక్ష రూపాయల విలువైన ఐ ఫోన్ 16 ప్రో మొబైల్ ను పోగొట్టుకున్నాడు. ఈ కేసు సి ఈ ఐ ఆర్ పోర్టల్ లో నమోదు చేసుకోని ఆ మొబైల్ ను హనుమకొండ పోలీస్ స్టేషన్ ఐ టి కోర్ టీం రఘుపతి శోధించి తిరిగి అతనికి హనుమకొండ పోలీస్ స్టేషన్లో ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ మాట్లాడుతూ ఎవరైనా తమ మొబైల్ ని పోగొట్టుకున్నట్లయితే సి ఈ ఐ అర్ పోర్టల్ లో పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఇన్స్పెక్టర్ గా చార్జ్ తీసుకున్నప్పటి నుండి మొబైల్స్ పోగొట్టుకున్న సుమారు 100 మొబైల్స్ ను ట్రేస్ అవుట్ చేసి యజమానులకు అప్పగించడం జరిగిందన్నారు.





## బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి దంపతులు

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లాలో బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి.పట్టణంలోని పలు చోట్ల అత్యంత వైభవంగా జరిగిన బతుకమ్మ వేడుకలలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డితో కలిసి పాల్గొన్నారు. తిర్పెల్లి లో పద్మ శాలి సంఘం ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొని తిర్పెల్లి శారదాదేవి మండపం అనంతరం చించర్ వాడ శారదాదేవి మండపాలను సందర్శించి స్థానికులు , మహిళలతో కలిసి బతుకమ్మ పాటలకు అనుగుణంగా లయబద్ధంగా కదం కలిపారు. ఆయా మండపాల నిర్వాహకులు కంది శ్రీనివాస రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ తాలూకా పద్మ శాలి సంఘం మాజీ అధ్యక్షులు బొమ్మకంటి రమేష్ ఆదిలాబాద్ పట్టణ మహిళ పద్మశాలి సంఘం అధ్యక్షురాలు తన్నీరు నవత, చిలుక విలాస్, మోర ఆశన్న, బూర్ల శంకరయ్య, చిప్ప గంగన్న, మెంచు అశోక్, కట్కం మహేష్, దాసరి రమేష్, ముదిగొండ సుధాకర్ ఆయా కాలనీ వాసులు పాల్గొన్నారు.





## బతుకమ్మ పాటను లాంచ్ చేసిన కంది శ్రీనివాస రెడ్డి దంపతులు

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ జిల్లా కళాకారులు రాచర్ల మహేష్ బృందం , శ్రీకృతి డాన్స్ అకాడమీ , మున్నూరు కాపు సంఘం సహకారంతో సంయుక్తంగా రూపొందించిన మాఇంటి బతుకమ్మ బతుకమ్మ పాటను ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తన క్యాంపు కార్యాలయం లోని సమావేశ మందిరం లో తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి ,పార్టీ శ్రేణులతో కలిసి లాంచ్ చేసారు. బిగ్ స్క్రీన్ పై తిలకించి హర్షం వ్యక్తం చేసారు. తెలంగాణా సంస్కృతీ సాంప్రదాయాలు ఉట్టిపడేలా మంచి పాటను నృత్యరూపకంతో రూపొందించిన డైరక్టర్ మహేష్‌ను రచయిత, గాయని సుజాత యాదవ్ , కొరియోగ్రాఫర్ రాజ్ కిరణ్ ,కెమెరా మెన్ కొత్తపల్లి కృష్ణ, ఎడిటర్ సాయిపవన్ లను ఆయన అభినందించి శాలువాలతో సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కళారూపాలు నిర్మించి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,బండారి సతీష్ , దర్శనాల లక్ష్మణ్ , దుర్గం శేఖర్,బూర్ల శంకరయ్య,తిరుమల్ రెడ్డి , మహిళా నాయకురాళ్లు దేశెట్టి ప్రభావతి, శ్రీలేఖ, నృత్యకళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో ఎన్నికల సహాయక కేంద్రం ఏర్పాటు

**హన్మకొండ మహా;** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం తెలిపారు. జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన సహాయక కేంద్రం 24/7 పాటు పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జడ్పిటిసి, ఎంపీటీసీ, గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన అంశాల పై సహాయక కేంద్రం ఫోన్ నెంబర్ 7981975495 ను సంప్రదించాలని జిల్లా ప్రజలకు సూచించారు.

## స్థానిక ఎన్నికలపై అధికారుల కసరత్తు



**ఆదిలాబాద్ మహా :** స్థానిక సంస్థల ఎన్నికలను చాలా పకడ్బందీగా నిర్వహించాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికలకు సంబంధించి ఫ్లయింగ్ స్క్వాడ్‌లు , స్టాటిక్ సర్వైలెన్స్ టీం లకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమం లో ఆయన ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి పాల్గొన్నారు. గ్రామ పంచాయతీలు, జడ్పీటీసీ, యంపీటీసీ ఎన్నికలపై ఎఫ్ఎస్, ఎస్ ఎస్టీ బృందాలకు శిక్షణా నిర్వాహకులు అవగాహన కల్పించారు. కలెక్టర్, ఎస్పీ బృంద సభ్యులకు కీలక మార్గదర్శకాలను సూచించారు. ఎన్నికల సమయంలో నిష్పక్షపాతంగా , పారదర్శకంగా విధులు నిర్వహించేందుకు ఫ్ఎస్, ఎస్ఎస్టీ బృందాలు కీలకంగా వ్యవహరిస్తాయని తెలిపారు.ఈ బృందాలు నియమావళి ఉల్లంఘనలు, అవాంఛనీయ కార్యకలాపాలు, నగదు, మద్యం, బహుమతుల పంపిణీ వంటి అక్రమ చర్యలపై పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, ప్రజాస్వామ్య విలువలను రక్షించేలా ఈ బృందాలు చురుకుగా పని చేయాలని సూచించారు. అంతేకాక, ప్రతి బృందం తక్షణ స్పందనతో, నిర్దిష్ట సమాచారంపై చొరవగా స్పందించి, ఎన్నికల ప్రామాణికతను కాపాడాల్సిన బాధ్యత ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు శ్యామలాదేవి, రాజేశ్వర్, ఉట్నూర్ అడిషనల్ ఎస్పీ కాజల్ సింగ్, ఆర్డీవో స్రవంతి, ఎన్నికల శాఖ అధికారులు, పోలీస్ సిబ్బంది, ఇతర సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తో కలిసి పోటీ చేస్తాం



**సీపీఐ జాతీయ సమితి సభ్యులు కలవేని శంకర్**

**మంచిర్యాల, మహా :** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తో కలిసి పోటీ చేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్ అన్నారు. మంచిర్యాల జిల్లా సిపిఐ పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జోగుల మల్లయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ మహాసభలు గత నెల 21 నుండి 25 వరకు చండీగఢ్ లో జరిగయని అన్నారు. ఈ సభలో ప్రధానంగా ఫాసిజంకి వ్యతిరేకంగా ఫెడరలిజంను కాపాడేవిదంగా పోరాడదామని రూపకల్పన చేసినట్లు వెల్లడించారు. అనంతరం సిపిఐ జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికైన కలవెన శంకర్ కు మంచిర్యాల జిల్లా కమిటీ పూలమాలవేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో మంచిర్యాల సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు, మిట్టపల్లి వెంకటస్వామి, మేకల దాస్, రేగుంట చంద్రశేఖర్, బొల్లం పూర్ణిమ, ఇప్పకాయల లింగయ్య, బీమనాథుని సుదర్శన్,కారుకూరి నగేష్, ఖలీందర్ అలీఖాన్,దాగం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.





## కాంగ్రెస్ పార్టీలోకి రిటైర్డ్ ఉద్యోగులు

**కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో చేరికలు**



**ఆదిలాబాద్, మహా :** స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ శాఖలలో పని చేసి రిటైర్డ్ అయిన అధికారులు ఉద్యోగులు కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారు. ఇప్పటికే కొందరు అధికారులు పార్టీలో చేరగా తాజాగా శనివారం బేల, జైనథ్, సాత్నాల, భోరజ్ మండలాలకు చెందిన మాజీ డీసీపీ మడావి బాపూరావు, ఐస్సై ఆత్రం దేవరావు, ఏఎస్సై కోవా పొచ్చిరాం, హెడ్ కానిస్టేబుల్ మెస్రం సురేష్,ఉపాధ్యాయులు పూసం ఆనంద్ రావు, మడావి శ్యాంరావు, కోవా గోవర్ధన్ , మడావి నాందేవ్, మాజీ మేనేజర్ కౌసింగే యాదవరావు కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. అనంతరం సాత్నాల మండలానికి చెందిన పలు గ్రామాల ప్రజలు కంది శ్రీనివాస రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. స్థానిక ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా అంతా కలసి ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మెన్ అల్లూరి అశోక్ రెడ్డి, వైస్ చెర్మన్ విలాస్ పటేల్, గిమ్మ సంతోష్, బాలూరి గోవర్ధన్ రెడ్డి, జైనథ్ ఆలయ కమిటీ చైర్మన్ అడ్డి రుకేష్ రెడ్డి, మాజీమున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, మాజీ కౌన్సిలర్ బండారి సతీష్, లోక ప్రవీణ్ రెడ్డి, గడ్డం జగదీష్ రెడ్డి, బేల కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఫైజల్లా ఖాన్,రాందాస్ నాక్లే, సింగిరెడ్డి రాంరెడ్డి, అల్లూరి భూమారెడ్డి, అశోక్ టాక్రె, శంకర్ భోక్రె తదితరులు పాల్గొన్నారు.



# వయసు 31.. సంపద రూ.21 వేలకోట్లు!

భారతదేశపు అతి పిన్న వయసున్న బిలియనీర్‌గా అరవింద్ శ్రీనివాస్(31)కు ప్రత్యేక గుర్తింపు లభించింది. చెన్నైలో జన్మించిన ఈయన పెర్‌ప్లెక్సిటీ ఏఐ సహ వ్యవస్థాపకుడిగా, ఆ సంస్థ సీఈఓగా ఉన్నారు. దాంతోపాటు హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025లో రూ.21,190 కోట్ల (సుమారు $2.5 బిలియన్లు) నికర విలువతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. తమిళనాడులోని చెన్నైలో పెరిగిన అరవింద్ శ్రీనివాస్ ప్రతిష్టాత్మక ఐఐటీ మద్రాస్ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. మెషిన్ లెర్నింగ్, ఏఐ పట్ల అభిరుచి పెంచుకున్నారు. తన ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఉన్నత విద్య కోసం యూఎస్ వెళ్లారు. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం, బెర్క్‌లీ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో పీహెచ్‌డీ సంపాదించారు. ఈ ప్రయాణంలో శ్రీనివాస్ తన నైపుణ్యాలను ప్రపంచంలోని అత్యంత ప్రభావవంతమైన ఏఐ సంస్థలతో కలిసి మెరుగుపరుచుకున్నారు. ఈ క్రమంలో OpenAI, గూగుల్, డీప్ మైండ్‌ల్లో పనిచేశారు. ఇక్కడ అతను అత్యాధునిక ఏఐ నమూనాలు, ఎల్ఎల్ఎం(లార్జ్ ల్యాంగ్వేజీ మోడల్స్)పై అనుభవం సాధించారు. ఇది అతని సొంత కంపెనీ స్థాపనకు కీలకంగా మారింది.

### పెర్‌ప్లెక్సిటీ ఏఐ

2022లో శ్రీనివాస్ డెనిస్ యారాట్స్, జానీ హో, ఆండీ కొన్వినిస్క్‌తో కలిసి పెర్‌ప్లెక్సిటీ ఏఐను స్థాపించారు. ఇది సాధారణ సెర్చ్ ఇంజిన్ కాదు. ఇది ఒక ఇంటెరాక్షన్ ఏఐ సెర్చ్ ఇంజిన్. ఏదైనా ప్రశ్నలకు సమాధానాలు పొందడానికి వేగవంతమైన మార్గంగా దీన్ని శ్రీనివాస్ అభివర్ణించారు. మార్కెట్‌లో తన పోటీదారులకు బలమైన ప్రత్యామ్నాయంగా పెర్‌ప్లెక్సిటీ నిలుస్తుంది. సంప్రదాయ సెర్చ్ ఇంజిన్ల మాదిరిగా హైపర్‌లింక్‌ల జాబితాను అందించడానికి బదులుగా పెర్‌ప్లెక్సిటీ ప్రత్యక్ష, ఇంటెరాక్షన్ సమాధానాలను అందిస్తుంది. ఇది మరింత కచ్చితమైన ప్రతిస్పందనలను రూపొందించడానికి జనరేటివ్ ఏఐను రియల్‌టైమ్ వెబ్ డేటాతో విలీనం చేస్తుంది. ఈ కంపెనీకి సిలికాన్ వ్యాలీలో గుర్తింపు లభించింది. ఈ స్టార్టప్‌కు అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్‌తో సహా అగ్రశ్రేణి పెట్టుబడిదారుల నుంచి నిధులు సమకూరాయి.

# సెలవుల్లేవ్.. వారంలో 7 రోజులు పని!

భారతదేశంలో మారుతి సుజుకి అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. దీంతో కంపెనీ సెప్టెంబర్ నెలలో తమ ఉత్పత్తిని 26 శాతం పెంచింది. వాహనాల ఉత్పత్తి పెరగడం వల్ల.. కొనుగోలుదారులకు సకాలంలో డెలివరీలు జరిగాయి. ఈ తరుణంలో ఉత్పత్తిలో గణనీయమైన వృద్ధిని సాధించడానికి.. ప్రొడక్షన్ టీమ్ ఆదివారాలు & సెలవు దినాలలో పని చేయాలని మారుతి సుజుకి మార్కెటింగ్ అండ్ సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు. నవరాత్రి మొదటి ఎనిమిది రోజుల్లో మారుతి సుజుకి దాదాపు 1,65,000 వాహనాలను డెలివరీ చేసింది. ఈ అమ్మకాలు గత ఏడాది సెప్టెంబర్‌తో పోలిస్తే 27.5 శాతం ఎక్కువ. త్వరలో డెలివరీలు రెండు లక్షలకు చేరుకుంటుందని చెబుతున్నారు. కంపెనీ సేల్స్ పెరగడానికి జీఎస్టీ 2.0 కూడా సహకరించింది. గత పదేళ్లలో ఇంతటి వృద్ధి (బుకింగ్స్ & డెలివరీలు) ఎప్పుడూ చూడలేదని కూడా పార్థో బెనర్జీ అన్నారు. డిమాండుకు తగ్గ డెలివరీలు చేయడానికి.. మారుతి సుజుకి గత నెలలో 12,318 యూనిట్ల ఆల్టో & ఎస్ ప్రెస్సో మోడళ్లను ఉత్పత్తి చేసింది. బాలెనో, సెలెరియో, డిజైర్ & స్విఫ్ట్ వంటి కాంపాక్ట్ మోడళ్ల ఉత్పత్తి సెప్టెంబర్‌లో 93,301 యూనిట్లు. బ్రెజ్జా, ఎర్టిగా & ఫ్రాంక్స్ వంటి యుటిలిటీ వాహనాల ఉత్పత్తి 79,496 యూనిట్లకు చేరుకుంది. ఈకో ఉత్పత్తి కూడా 13,201 యూనిట్లకు పెరిగింది. మొత్తం మీద కంపెనీ ఈ ఏడాది అమ్మకాల్లో గణనీయమైన వృద్ధిని సాధించింది.



# షాపింగ్ మాల్స్ విస్తరణ..

## రిటైల్ కేంద్రాలకు అవకాశం



**సిటీబ్యూరో:** సంస్థాగత పెట్టుబడులు ద్వితీయ శ్రేణి పట్టణాలకు శరవేగంగా విస్తరిస్తున్నాయి. పట్టణీకరణ, అధిక జనాభా, కొనుగోలు శక్తి పెరుగుతుండటంతో వ్యవస్థీకృత రిటైల్ కేంద్రాలకు అవకాశాలు లభిస్తున్నాయి. మారుతున్న వినియోదారుల అభిరుచులతో ప్రపంచ బ్రాండ్లు విస్తరణపై దృష్టిసారిస్తున్నాయి. చండీఘడ్, ఇండోర్, సూరత్, భువనేశ్వర్, కోయంబత్తూరు వంటి ద్వితీయ శ్రేణి పట్టణాలు నెక్సస్(బ్లాక్ స్టోన్), డీఎల్ఎఫ్, ఫీనిక్స్ మిల్స్, ప్రెస్టీజ్ ఎస్టేట్స్, లేక్‌షోర్, రహేజా గ్రూప్, పసిఫిక్ వంటి సంస్థాగత దిగ్గజాలను ఆకర్షిస్తున్నాయి. ఈ ఏడు సంస్థలు వచ్చే 3-5 ఏళ్లలో 4.25 కోట్ల చ.అ. కంటే ఎక్కువ విస్తీర్ణంలో కొత్తగా 45 షాపింగ్ మాల్స్‌ను అందుబాటులోకి తీసుకురానున్నాయి. ప్రస్తుతం ఈ ఏడు సంస్థలకు సమష్టిగా 3.4 కోట్ల చ.అ. విస్తీర్ణంలో 58 మాల్స్ ఉన్నాయి. ప్రస్తుతం దేశంలో గ్రేడ్ఏ, బీ, సీ కేటగిరీ మాల్స్ అన్నీ కలిపి 650 షాపింగ్ మాల్స్ ఆపరేషనల్‌లో ఉన్నాయి. ఇండియాలో 11 కోట్ల చ.అ. నాణ్యమైన రిటైల్ స్పేస్ ఉంది. అమెరికాలో 70 కోట్ల చ.అ., చైనాలో 40 కోట్ల చ.అ. రిటైల్ స్థలం అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో అధిక శాతం స్థలం సంస్థాగత నిర్మాణ సంస్థల యాజమాన్యంలోనే ఉన్నాయని అనరాక్ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది.

# ఉల్లంఘనల్లో దొరికిన ఐదు బ్యాంకులు

## ఆర్బీఐ కఠిన చర్యలు

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఐదు బ్యాంకులపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) కఠిన చర్యలు తీసుకుంది. మార్గదర్శకాలను పాటించనందుకు ద్రవ్య జరిమానాలు విధించింది. ఈ జాబితాలో ఒక నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ కూడా ఉంది. ఈ వివరాలను ఆర్బీఐ పత్రికా ప్రకటనలో తెలియజేసింది.

**రెండు కర్ణాటక బ్యాంకులు**


ఆర్బీఐ చర్యలకు గురైన బ్యాంకులలో రెండు కర్ణాటకకు చెందినవి. బీఆర్ చట్టాన్ని ఉల్లంఘించి ఇతర సహకార సంఘాలలో వాటాలను కలిగి ఉన్నందుకు హసన్ డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లిమిటెడ్‌కు రూ .1 లక్ష జరిమానా విధించింది. అలాగే నిర్ణీత కాలవ్యవధిలోగా కస్టమర్ కేవైసీ రికార్డులను సెంట్రల్ కెవైసి రికార్డ్స్ రిజిస్ట్రీకి అప్ లోడ్ చేయడంలో ఈ బ్యాంక్ విఫలమైంది. డైరెక్టర్ సంబంధీకులకు రుణాలు మంజూరు చేసినందుకు గానూ బాగల్‌కోట్ డిస్ట్రిక్ట్ సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్‌కు ఆర్బీఐ రూ.5.50 లక్షల జరిమానా విధించింది. నిర్ణీత కాలపరిమితిలో నాబార్డ్‌కు కొన్ని చట్టబద్ధమైన రిటర్న్‌లను సమర్పించడంలోనూ ఇది విఫలమైంది.

**క్రెడిట్, డెబిట్ కార్డు నిబంధనలు ఉల్లంఘించినందుకు..**


క్రెడిట్, డెబిట్ కార్డులకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించినందుకు ఎక్స్‌ప్రెస్ బ్యాంకింగ్ కార్పొరేషన్‌కు ఆర్బీఐ రూ.31.80 లక్షల జరిమానా విధించింది. కొంతమంది క్రెడిట్ కార్డుదారుల క్రెడిట్ బ్యాలెన్స్ లను వారి బ్యాంకు ఖాతాలకు తిరిగి చెల్లించడం/ఫెయిల్/రివర్స్ చేయడంలో బ్యాంకు విఫలమైందని దర్యాప్తులో తేలింది. గుజరాత్ లోని పటాన్ లో ఉన్న రనూజ్ నగరిక్ సహకార బ్యాంక్ లిమిటెడ్ మంజూరు చేసిన కొన్ని రుణాలు దారిమళ్లకుండా చూడటంలో విఫలమైనందుకు రూ .3 లక్షల జరిమానా ఎదుర్కొంది. ఇంకా, అనధికార ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ లావాదేవీలపై అభ్యంతరాలను లేవనెత్తడానికి ఎస్ఎంఎస్ హెచ్చరికలకు వెంటనే స్పందించడంలో తన వినియోగదారులను అనుమతించడంలోనూ విఫలమైంది. తమిళనాడులోని దివ్యం విద్యాలయం టౌన్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్‌కు రూ.1 లక్ష జరిమానా విధించింది. చట్టం కింద జారీ చేసిన ఆదేశాలను ఉల్లంఘిస్తూ రిస్క్ పరిమితికి మించి కొన్ని కొత్త రుణాలు, అడ్వాన్సులు, 100% కంటే ఎక్కువ రిస్క్ ఎక్స్‌పోజర్లతో కొన్ని రుణాలు, అడ్వాన్సులను మంజూరు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే నిర్ణీత కాలవ్యవధిలోగా కస్టమర్ కేవైసీ రికార్డులను సెంట్రల్ కెవైసి రికార్డ్స్ రిజిస్ట్రీకి అప్ లోడ్ చేయడంలో బ్యాంక్ విఫలమైంది.

**ఈ ఎన్‌బీఎఫ్‌సీకి జరిమానా**

202324 ఆర్థిక సంవత్సరంలో తన ఖాతాల్లో పాన్ సమాచారం లేదా ఫారం నంబర్ 60 పత్రాలను అందించడంలో విఫలమైనందుకు హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌కు ఆర్బీఐ రూ .4.20 లక్షల జరిమానా విధించింది.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# జాక్ 38 డిమాండ్‌లకు పాక్ అంగీకారం

జమ్ముకశ్మీర్ అప్నీ అమన్ కమిటీ(జేఏఏసీజాక్)ప్రతిపాదించిన 38 డిమాండ్లను పాకిస్తాన్ ప్రభుత్వం శనివారం ఆమోదించింది. అలాగే పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఇటీవల చోటుచేసుకున్న నిరసనకారుల మరణాలపై న్యాయ విచారణకు, నిర్బంధించిన ప్రదర్శనకారుల విడుదలకు పాకిస్తాన్ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. అలాగే జమ్ముకశ్మీర్ శరణార్థుల కోసం రిజర్వు చేసిన 12 అసెంబ్లీ సీట్లను రద్దు చేయడంపై ఉన్న చట్టపరమైన సాధ్యాసాధ్యాలను ఉన్నత స్థాయి కమిటీ పరిశీలిస్తుందని తెలియజేసింది. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లో అవామీ యాక్షన్ కమిటీ (ఏఏసీ) నేతృత్వంలో కొన్ని రోజులుగా నిరసనలు కొనసాగుతున్నాయి. పీఓకేలో మౌలిక సంస్కరణలు తీసుకురావాలని తమ 38 డిమాండ్లను అమలు చేయాలని ఏఏసీ ఆందోళనలకు పిలుపునిచ్చింది. దీంతో, భారీ సంఖ్యలో ప్రజలు బయటకు వచ్చి నిరసనల్లో పాల్గొన్నారు. తమ ప్రాథమిక హక్కులను పాకిస్తాన్ హరిస్తోందని నిరసనకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణల్లో 10 మంది మరణించగా, 50 మందికి పైగా జనం గాయపడ్డారు. ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న 'జాక్', ప్రభుత్వ ప్రతినిధుల మధ్య రెండు రౌండ్ల ఉన్నత స్థాయి చర్చల దరిమిలా పాకిస్తాన్ ప్రభుత్వం దిగివచ్చింది. సెప్టెంబర్ 29న సమ్మెకు పిలుపునిచ్చిన తర్వాత ఈ ప్రాంతంలో హింస చెలరేగింది. కాగా పీఓకేలో కొనసాగుతున్న హింస విషయంలో తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు గతంలో పాకిస్తాన్ మానవ హక్కుల కమిషన్ పేర్కొంది. మరోవైపు నిరసనకారులపై పాకిస్తాన్ ప్రభుత్వం అనుసరిస్తున్న అణిచివేత ధోరణిని భారతదేశం తీవ్రంగా విమర్శించింది. ఇది మానవ హక్కుల ఉల్లంఘన అని ఆరోపించింది.





# ట్రంప్ మాటను లెక్కచేయకుండా!!

**ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ఒప్పందానికి హమాస్ సిద్ధంగా ఉందని.. బందీల విడుదలకు అంగీకరించిందని.. గాజాలో దాడులు ఆపాలని.. అమెరికా అధ్యక్షుడు ఇజ్రాయెల్‌కు పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఆ మాటను లెక్కచేయకుండా మళ్లీ దాడులు కొనసాగిస్తోంది. శనివారం గాజాలో ఇజ్రాయెల్ బలగాలు జరిగిపిన దాడుల్లో ఆరుగురు మరణించారు.**

బందీల విడుదలతో పాటు ట్రంప్ ప్రతిపాదనలో పలు అంశాలకు హమాస్ అంగీకరించిందని.. అమెరికా ఈ యుద్ధాన్ని ముగించే దిశగా ముందుకు వెళ్తోందని ట్రంప్ స్వయంగా ప్రకటించారు. అటుపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు సైతం 'ట్రంప్ గాజా ప్లాన్'(Trump Gaza Plan) తొలి దశ తక్షణమే అమలు కాబోతోందని అన్నారు. ఆ వెంటనే ఇజ్రాయెల్ ఆర్మీ చీఫ్ సైతం దీనిని ధృవీకరించారు. దీంతో పలు దేశాల అధినేతలూ ట్రంప్ కృషికి అభినందనలు తెలియజేశారు కూడా. అయితే.. అనూహ్యంగా.. ఈ ప్రకటనలు వెలువడిన గంటల వ్యవధిలోనే గాజాపై ఇజ్రాయెల్ బలగాలు(Israel Attacks Gaza Agian) విరుచుకుపడ్డాయి. గాజా సిటీలో జరిపిన దాడుల్లో నలుగురు పౌరులు మృతి చెందగా.. దక్షిణ భాగంలోని ఖాన్ యూనిస్ వద్ద మరో ఇద్దరు చనిపోయినట్లు అక్కడి అధికారులు ధృవీకరించారు. అయితే తాజా దాడులపై ఇజ్రాయెల్, అమెరికా, హమాస్ వైపుల నుంచి స్పందన రావాల్సి ఉంది. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్ సరిహద్దులో హమాస్ సంస్థ జరిపిన మెరుపు దాడిలో 1,200 మంది మరణించారు. మరో 251 మంది బంధీలుగా తీసుకెళ్లారు. పాలస్తీనియన్ భూభాగాల్లో ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్ల విస్తరణ.. వాళ్ల చేతుల్లో పాలస్తీనా పౌరులు హింసకు గురి కావడం, అల్ అక్సా మసీదు వద్ద ఘర్షణలు, జెనిన్ శరణార్థి శిబిరంపై దాడులు.. ఈ వరుస పరిణామాలు హమాస్ దాడికి కారణాలు. ఈ భారీ దాడికి ప్రతిగా.. ఇజ్రాయెల్ గాజాపై ఆపరేషన్ ఐరన్ స్వోర్డ్స్ చేపట్టింది. అప్పటి నుంచి ఇప్పటిదాకా జరిపిన దాడుల్లో 66, 000 మందికి పైగా మరణించారు. మృతుల్లో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నారు. విధ్వంసంతో పాటు గాజాను దిగ్బంధించి.. మానవతా సాయాన్ని అందకుండా ఇజ్రాయెల్ బలగాలు చేశాయి. విద్యుత్ కొరత, తిండి, నీరు లేక అక్కడి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అయితే తాము హమాస్‌ను మాత్రమే లక్ష్యంగా చేసుకుని దాడులు జరుపుతున్నామని, పౌరులను రక్షణ కవచంలా వాళ్లు ఉపయోగించుకుంటున్నారంటూ ఇజ్రాయెల్ చెబుతూ వస్తోంది. ఈ క్రమంలో ట్రంప్ ఎంట్రీతో పరిస్థితి మారింది. అదే సమయంలో బంధీల విడుదల కోసం ఇజ్రాయెల్‌పై ఒత్తిడి పెరుగుతూ వస్తోంది.. ఈ తరుణంలో.. ట్రంప్ ప్రతిపాదించిన 20పాయింట్ల శాంతి ఒప్పందానికి హమాస్ అంగీకారం తెలిపింది. ప్రస్తుతం 48 మంది బంధీలు ఉన్నారని, వారిలో 20 మంది జీవించి ఉన్నారని తెలుస్తోంది. తొలి దశలో భాగంగా.. బంధీల విడుదలకు సిద్ధంగా ఉందని తెలిపింది.

# నామినేటెడ్ పేర్లు .. 50 ఏళ్లగా ఎందుకంత సీక్రెట్?



**న్యూఢిల్లీ:** అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతి విజేతలను ప్రకటించే వారం దగ్గరపడింది. ఈ సోమవారం అంటే అక్టోబరు 6 నుంచి అక్టోబరు 13 వరకు విజేతల ప్రకటన ప్రక్రియ కొనసాగనుంది. వైద్య రంగం, భౌతిక శాస్త్రం, సాహిత్యం,రసాయన శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, శాంతి తదితర విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందించేవారిని నోబెల్ బహుమతులతో సత్కరించనున్నారు.

**జ్యూరీ అనుసరించే విధానం**

నోబెల్ బహుమతుల ఎంపిక ప్రక్రియ ఎంతో ఆసక్తికరంగా సాగుతుంది. అవార్డుల విజేతలను జ్యూరీ అత్యంత రహస్యంగా ఎంపిక చేస్తుంది. గోప్యత అనేది విజేతల ఎంపికలో తప్పనిసరి విధానం. ఇది నిష్పాక్షికతను నిర్ధారిస్తుంది. నామినీలు, నామినేటర్ల గుర్తింపులను గత 50 ఏళ్లగా ఎంతో గోప్యంగా ఉంచుతున్నారు. ఇటువంటి విధానం బాహ్య ఒత్తిళ్లు, ఊహాగానాలను నివారిస్తుంది. అవార్డుల గొప్పతనాన్ని కాపాడుతూ, విజేతలు ఎవరనే ఉత్కంఠను కొనసాగిస్తుంది. ప్రముఖ ప్రొఫెసర్లు, మునుపటి అవార్డు గ్రహీతలు, ప్రభుత్వాలు, పార్లమెంటు సభ్యులు, శాంతి పరిశోధన సంస్థల డైరెక్టర్లు.. నోబెల్ బహుమతులకు అర్హులైవారిని నామినేట్ చేస్తారు. స్వీయ నామినేషన్లకు అవకాశం ఉండదు.

**శాంతి బహుమతి విభాగంలో..**

నామినేషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత ప్రతి వర్గానికి లేదా విభాగానికి చెందిన నిపుణుల కమిటీలు నామినేషన్లను సమీక్షిస్తాయి. ఈ కమిటీలు నివేదికలను సిద్ధం చేస్తాయి. ఆల్ఫ్రెడ్ నోబెల్ వీలునామాలో పేర్కొన్న బహుమతి ప్రమాణాలకు అనుగుణంగా అభ్యర్థులు ఉన్నారా? లేదా అనే దానిపై చర్చలు జరుగుతాయి. నోబెల్ శాంతి బహుమతి విభాగంలో నార్వే పార్లమెంట్ నియమించిన ఐదుగురు సభ్యుల 'నార్వేజియన్ నోబెల్ కమిటీ' ఎంపికకు సారథ్యం వహిస్తుంది. వారు తమకు అందిన నామినీల నుండి ఒక షార్ట్‌లిస్ట్‌ను తయారు చేస్తారు. అభ్యర్థులను ఖరారు చేసేందుకు నిపుణుల అభిప్రాయాలను తీసుకుంటారు. తుది నిర్ణయాన్ని సాధారణంగా ఏకాభిప్రాయం మేరకు తీసుకుంటారు. అక్టోబర్‌లో అధికారిక ప్రకటనకు ముందు ఈ తతంగమంతా జరుగుతుంది.

**ఎంపిక ప్రక్రియలో వీటికి తావుండదు**

సాహిత్యంలో నోబెల్ బహుమతి విషయానికొస్తే స్వీడిష్ అకాడమీ సభ్యులు నామినేటెడ్ అభ్యర్థులను రచనలను రహస్యంగా అంచనా వేస్తారు. అకాడమీ సభ్యుల మెజారిటీ మద్దతును అందుకున్నవారే తుది అర్హత సాధిస్తారు. గోప్యతా నియమం అన్ని బహుమతి విభాగాలకు వర్తిస్తుంది. లాబీయింగ్, మీడియా హైప్, రాజకీయ జోక్యం మొదలైనవాటికి ఎంపిక ప్రక్రియలో తావుండదు. కఠినమైన గోప్యత, నిపుణుల నిర్ణయం, మెజారిటీ సభ్యుల ఏకాభిప్రాయం మేరకే నోబెల్ బహుమతులకు అత్యంత అర్హులైనవారిని ఎంపిక చేస్తారు.

# నీరవ్ మోదీ కేసులో కీలక పరిణామం.. అప్పగింతకు గ్రీన్ సిగ్నల్!



**లండన్:** పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. నీరవ్ మోదీని భారత్‌కు అప్పగించేందుకు యూకే సిద్ధమైంది. ప్రస్తుతం బ్రిటన్ జైల్లో ఉన్న నీరవ్ మోదీని.. వచ్చే నెల 23వ తేదీన భారత్‌కు అప్పగించే అవకాశం ఉంది. ముంబై ఆర్థర్ రోడ్ జైల్లో నీరవ్ మోదీని ఉంచే అవకాశం ఉంది. గుజరాత్‌కు చెందిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ(54) పంజాబ్ నేషనల్ బ్యాంక్ (PNB) కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటున్నారు. దాదాపు ₹14,000 కోట్ల మోసానికి పాల్పడి 2018లో దేశం విడిచి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయన లండన్(యూకే)లో ఉన్నట్లు సమాచారం. దీంతో ఆయన అప్పగింత కోసం భారత్ అభ్యర్థించగా.. ఆ కేసు అక్కడి కోర్టులో విచారణ జరుగుతోంది. అయితే తాజాగా నీరవ్ మోదీని భారత్‌కు అప్పగించేందుకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు సమాచారం. నీరవ్ మోదీకి భారత్‌లో అన్ని వసతులు కల్పిస్తామని, అత్యంత కట్టుదిట్టమైన ముంబై ఆర్థర్ రోడ్ జైల్లో ఉంచుతామని భారత్ హామీ ఇవ్వడంతో బ్రిటన్ కోర్టు అందుకు అంగీకరించింది. దాంతో నీరవ్ మోదీని భారత్‌కు రప్పించాలని ప్రయత్నానికి మార్గం సుగుమం అయ్యింది. కాగా, ఈ ఏడాది జూలై నెలలో నీరవ్ మోదీ సోదరుడు నేహల్ మోదీని అమెరికాలో అరెస్టు చేశారు. అతడిని అప్పగించాలన్న భారత దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీలు అభ్యర్థించాయి. భారత ప్రభుత్వ అభ్యర్థన మేరకు ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు ఆధారంగా అమెరికా అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం కేసులో కీలక పాత్ర పోషించినట్లు నేహల్‌పై ఆరోపణలు ఉన్నాయి మనీ లాండరింగ్ మరియు నేరపూరిత కుట్ర కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్నారు.

# కూలీ ఫేమ్ రచిత రామ్
# కల్ట్ పోస్టర్ విడుదల




కన్నడ హీరోయిన్ రచిత రామ్ పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమా పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. రీసెంట్‌గా కూలీ సినిమాలో లేడీ విలన్‌గా నటించిన ఈ బ్యూటీ తాజాగా 'కల్ట్' పేరుతో ఒక రొమాంటిక్ థ్రిల్లర్ సినిమాలో నటించనున్నారు. ఈ మూవీకి 'బ్లడీ లవ్' అనే ట్యాగ్‌లైన్ కూడా ఇచ్చారు. ఈ చిత్రాన్ని దర్శకుడు అనిల్ కుమార్ తెరకెక్కించనున్నారు. ఇందులో రచిత రామ్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా ఆమెకు జోడీగా జైద్ ఖాన్ కనిపించనున్నారు. ఈ సినిమా కథలో రచిత రామ్ ఒక లవ్ ఫెయిల్యూర్ యువతిగా కనిపించనున్నారు. ఆ తర్వాత ఆమె జీవితం ఎలా మలుపులు తిరుగుతుంది అనే అంశం చుట్టూ కథ సాగుతుంది. రచిత రామ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన కల్ట్ పోస్టర్‌లో ఆమె లేడీ డాన్ లుక్‌లో కనిపించారు. బాత్రూమ్‌లో టాయిలెట్ సీటింగ్‌పై కూర్చొని, సిగరెట్ తాగుతూ.. ఆమె మాస్ లుక్ అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. పక్కన గిటార్ కాలిపోతుండగా, వెనకాల ఒక వ్యక్తి బాధతో చూస్తున్న ఫొటో కూడా ఉంది. "నీ జ్ఞాపకాలను ఫ్లష్ చేసి తుడిచి పెట్టలేను" అనే డైలాగ్‌తో పోస్టర్ మరింత ఆసక్తికరంగా మారింది. ఈ సినిమా ద్వారా రచిత రామ్ మరోసారి తన నటనలో విభిన్నతను చూపించ బోతున్నారు. ఇలాంటి పాత్రలతో రచిత రామ్ తన కెరీర్‌లో కొత్త మలుపు తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఈ మూవీ వచ్చే ఏడాది జనవరి 23న తెలుగులో కూడా విడుదల కానుంది.



# డిసెంబరులో...

బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. ఈ చిత్రంలో సంయుక్తా మీనన్ హీరోయిన్. ఎం. తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 25న ఈ సినిమాని విడుదల చేయనున్నట్లు మేకర్స్ తొలుత ప్రకటించారు. తాజాగా డిసెంబరు 5న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందిన తొలి చిత్రం 'వీరసింహా రెడ్డి' (2023). వీరి కాంబినేషన్‌లో రానున్న ద్వితీయ చిత్రం 'ఎన్‌బీకే 111' (వర్కింగ్ టైటిల్). వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మించనున్న ఈ సినిమా ఈ నెల 24న ప్రారంభం కానుంది.

# సాయిపల్లవితో నాగ్ అశ్విన్ చర్చలు

ప్రభాస్ టైటిల్ రోల్ పోషించిన సైన్స్ ఫిక్షన్ జోనర్ ప్రాజెక్ట్ కల్కి 2898 ఏడీ. మహానటి ఫేం నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ తెరకెక్కించిన ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా 2024 జూన్ 27న తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదలై.. గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.1100 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. కాగా సిల్వర్ స్క్రీన్‌పై రికార్డు వర్షం కురిపించిన ఈ మూవీకి సీక్వెల్ కల్కి 2 కూడా రాబోతుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అయితే సీక్వెల్ పార్ట్‌లో దీపికాపదుకొనే ఉండటం లేదంటూ ఇప్పటికే నెట్టింట వార్తలు రౌండప్ చేస్తున్నాయి. తాజాగా దీనికి సంబంధించిన ఆసక్తికర అప్‌డేట్ ఒకటి తెరపైకి వచ్చింది. అదేంటంటే తెలుగుతోపాటు పాన్ ఇండియా స్థాయిలో మంచి గుర్తింపు ఉన్న కోలీవుడ్ భామ సాయిపల్లవి కల్కి 2లో కనిపించబోతుందట. డైరెక్టర్ నాగ్ అశ్విన్ స్టార్ హీరోయిన్ సాయిపల్లవితో చర్చలు జరిపినట్టు ఓ వార్త ఇప్పుడు నెట్టింట హల్ చల్ చేస్తోంది. ముందుగా నాగ్ అశ్విన్ సాయిపల్లవితో ఓ ఫీ మేల్ ఓరియెంటెడ్ సినిమా చేసే ప్లాన్‌లో ఉన్నట్టు వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడు మాత్రం కల్కి 2లో దీపికా పదుకొనే స్థానంలో సాయిపల్లవిని రీప్లేస్ చేయాలని ఫిక్స్ అయ్యాడట. మరి నాగ్ అశ్విన్‌సాయిపల్లవి కాంబోపై రానున్న రోజుల్లో ఏమైనా క్లారిటీ వస్తుందేమో చూడాలనుకుంటున్నారు ప్రభాస్ అభిమానులు. ఇంతకీ మరి నాగ్ అశ్విన్‌సాయిపల్లవి కాంబినేషన్‌లో రాబోయేది ఫీ మేల్ ఓరియెంటెడ్ మూవీనా..? కల్కి 2 నా అనేది తెలియాల్సి ఉంది. కల్కి 2898 ఏడీలో బాలీవుడ్ భామ దిశా పటానీ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటించగా.. లెజెండరీ యాక్టర్లు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్రప్రసాద్, పశుపతి ఇతర కీలక పాత్రలు పోషించారు. బెంగాలీ నటుడు శాశ్వత ఛటర్జీ విలన్‌గా నటించాడు.





# ఏం పర్లేదు, నేను ఇండియన్ అంకుల్‌నే అనుకోండి!

కొంతమంది ఫోటోలు దిగడంలో దిట్ట. కొందరికేమో సరిగా ఫోటోలు దిగడమే రాదు. హీరోయిన్ శోభిత ధూళిపాళ రెండో కోవలోకి వస్తుంది. ఫోటో దిగేటప్పుడు కెమెరా వైపు కాకుండా మరోవైపు బిత్తరచూపులు చూస్తోంది. ఇందుకు సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. నేనెప్పుడు సెల్ఫీ తీసుకున్నా.. కెమెరా వైపు కాకుండా స్క్రీన్‌లో నన్ను నేను చూసుకుంటూ ఉన్నాను. ఇండియన్ అంకుల్స్ ఇలాగే చేస్తారు కదా!

## సెల్ఫీ ఫోటోలు

ఇట్స్ ఓకే.. నన్ను ఇండియన్ అంకుల్ అనుకోండి.. మరేం పర్వాలేదు అని క్యాప్షన్ ఇచ్చింది. తను యోగా చేస్తున్న ఫోటోను, తిన్న ఐస్‌క్రీమ్‌ను, అద్దంలోనుంచి బయటకు చూస్తున్న పిక్స్‌ను ఈ పోస్ట్‌లో జత చేసింది. అలాగే రెండు సెల్ఫీ పిక్స్ కూడా ఉన్నాయి. సినిమాల విషయానికి వస్తే.. తెలుగులో గూఢచారి, మేజర్ చిత్రాలతో మెప్పించింది తెలుగు బ్యూటీ.

## సినిమా

హిందీలో.. రామన్ రాఘవ్ 2.0, చెఫ్, ద బాడీ, లవ్ సితార వంటి సినిమాలు చేసింది. తమిళంలో పొన్నియన్ సెల్వన్ ఫస్ట్, సెకండ్ పార్ట్స్ లో నటించింది. మలయాళంలోనూ రెండు సినిమాలు చేసింది. ఓటీటీలో మేడ్ ఇన్ హెవెన్, ద నైట్ మేనేజర్ వెబ్ సిరీస్‌లలోనూ నటించింది. ప్రస్తుతం తమిళంలో పా.రంజిత్ డైరెక్షన్‌లో 'వెట్టువం' మూవీలో శోభిత యాక్ట్ చేస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com